honeybee.org
Vol-8 Issue-1

సంపుటి 7 సంచిక 6 నవంబర్ - డిసెంబర్ 2019

# పల్లెసృజన

www.pallesrujana.org


గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

## జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన తెలుగు ఇన్నోవేటర్లు






# సృజనాత్మకత వెనక వున్న విషాదం



ఒక గ్రామంలో ఒక మంచి శిల్పి ఉండేవాడు. అతనికి స్థానికంగా చాలా నైపుణ్యం కలవాడని పేరుంది. అతని కుమారుడు కూడా తానూ శిల్పిని కావాలని కోరుకునేవాడు. కానీ, తండ్రి తనకున్న చికాకులు, ఇబ్బందుల కారణంగా కొడుకు పనితనాన్ని చూసేవాడు కాదు. కొడుకుతో మెచ్చుకోలుగా, ఉత్సాహ పరిచే విధంగా ఒక్క మాట కూడా అనేవాడు కాదు. కొడుకు తన తండ్రి మెప్పుకోసం తపించిపోయేవాడు.

ఒకరోజు మధ్యాహ్నం కొడుకు ఇంటి పెరటిలో ఏదో పోగొట్టుకున్నది వెతుకులాడుతున్నట్టు శ్రద్ధగా త్రవ్వసాగాడు. పక్కనే వున్న తండ్రి కొంతసేపటికి కొడుకు విచిత్ర ప్రవర్తన గమనించి, ఏం చేస్తున్నావిక్కడ, కుదురుగా ఉండలేవా? అని కోప్పడ్డాడు. దానికి కొడుకు ఇప్పుడే ఒక అందమైన వస్తువు పడిపోయింది, దానికోసమే త్రవ్వుతున్నాను అన్నాడు. తండ్రికీ కొంత ఆసక్తి కలిగింది. తానూ కొడుకుకి తవ్వటంలో సహాయపడ్డాడు. కొంతసేపటికి వారికి ఒక నృత్యం చేస్తున్న స్త్రీ ప్రతిమ దొరికింది. తండ్రి దానిని చూసి, ఆశ్చర్యపడి ఇది కళాఖండం, ఎంత అందంగా, ఎంత ఉత్తమంగా ఉంది, దీన్ని ఏ మహాశిల్పి చెక్కాడో కదా అన్నాడు. దానికి కొడుకు బాధగా నవ్వి, నా జీవితం ధన్యమైందీరోజు అన్నాడు.

శిల్పి కొడుకు ఆ ప్రతిమని తానే చెక్కి భూమిలో దాచాడు. ఈ రోజుల్లో చాలామంది పిల్లలు చేస్తున్నట్లే, మనలో చాలామంది తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా విద్యార్థుల విద్యేతర విషయాలపై ప్రోత్సహించడం లేదు. కొందరు విమర్శిస్తుంటారు కూడా. మేము కలిసి మాట్లాడిన చాలామంది పిల్లలు రకరకాల అనుభవాలు వ్యక్తం చేశారు. కొందరు తమ తల్లిదండ్రులు, అధ్యాపకులు చాలా ప్రోత్సాహకరంగా ఉంటారు అన్నారు. కొందరేమో అసలు ఉండరు అన్నారు. వివిధ రంగాలలో అభిరుచులు ఏమాత్రం పెంపొందించుకోని పిల్లలు భిన్నత్వం కలిగిన ఈ సమాజాన్ని ఏమని అర్థం చేసుకుంటారు? దానికేం సహాయం చేయగలుగుతారు? వాళ్ళ దృష్టిలో జీవితంలో గెలుపు అంటే కేవలం చదువే అవుతుంది. మేము పిల్లల్ని ప్రోత్సహించే పెద్దల గురించి వినదల్చుకున్నాం. మీకు తెలిస్తే వ్రాసి పంపండి.

- హానీ 20 (2) - 2009

Vol-8, Issue - 1 Nobember-December 2019

## విషయ సూచిక

# పల్లెసృజన

సంపుటి-8 సంచిక-1 నవంబర్-డిసెంబర్ 2019

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం,**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె సీత రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**బాలసుబ్రమణ్యం దుర్గాప్రసాద్,**
**జమ్ములమడక శ్రీకర్,**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/-**
**for 5 years Subscription**



3 అశోక్ పటేల్


6 'రైతు నేస్తం'లో 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ప్రదర్శన


10 ఊర పందుల పెంపకం సులభ విధానం


11 సిసలైన 'కారణ జన్ముడు' అన్నం శ్రీనివాసరావు


18 గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు


22 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు


25 గార్లె అశోక్


27 అంతర్జాతీయ అవార్డు పొందిన ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేటర్ తిరుపతి రావు


30 మొక్కజొన్న 'ఔషధ గని' - పండు 'పరమ ఔషధం'


32 స్పందన


ముఖ చిత్రం ... తెలంగాణ గవర్నర్ ...

మధ్య పేజీలో : 'తెలంగాణ ఇన్నోవేషన్ల ఉత్సవం'లో పల్లెసృజన వెలుగులు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-6-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094, Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

| | | |
|---|---|---|
| **Honey Bee (English)** AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangpura, Ahmedabad - 380 009 Gujarat, India, Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org | **Karshakan Samsarikkatte (Malayalam)** Fr Hubby Mathew Peermade Development Society Peermade, Idukki - 685531, Kerala hmathew@gmail.com | **Num Vali Velanmai (Tamil)** Mr P Vivekanandan 45, T P M Nagar Virattipathu, Madurai - 625010 Tamil Nadu vivekseva@gmail.com |
| **Palle Srujana (Telugu)** Brig Pogula Ganesham VSM (Retd) 102, Vayupuri, Sainikpuri Post Secunderabad-500 094 Telangana, president@pallesrujana.org, www.pallesrujana.org | **Loksarvani (Gujarati)** SRISTI, P O Box No.15050 Ambawadi Ahmedabad - 380015 Gujarat loksarvani@sristi.org | **Sujh-Bujh Aas Paas ki (Hindi)** SRISTI, P O Box No.15050 Ambawadi Ahmedabad - 380015 Gujarat loksarvani@sristi.org |

# రైతులు పురుగు మందులు ఆవిష్కరించలేరా!

పూర్తి స్థాయి ఇన్నోవేటర్ 'గల్లా చంద్రశేఖర్' శ్రీకాళహస్తికి దగ్గరలోని 'కాలాకొల్లు' గ్రామ నివాసి. ఆయనకు సైన్స్ అంటే అమితమైన ప్రేమ. ప్రకృతి అంటే ఎంతో గౌరవం. ఈ రెండింటి సమ్మేళనం మానవ కళ్యాణానికి దారి చూపిస్తుందని ఆయన ప్రగాఢ విశ్వాసం. తనకున్న శాస్త్రీయ పరిజ్ఞానంతో పంటలకు, పశువులకు, ప్రజలకు ప్రకృతిసిద్ధమైన పరిష్కారాలను కనుగొనే దిశలో గత రెండు దశాబ్దాలుగా ప్రయోగాలు చేస్తూనే వున్నారు. చంద్రశేఖర్ తాను చేసిన 26 ఇన్నోవేషన్ల వివరాలను హైదరాబాద్ లోని ఐఐసిటి, సిసిఎంబి కు చెందిన 30 మంది నిష్ణాతులైన శాస్త్రవేత్తల ముందు ప్రదర్శించి, వివరించారు. 2013లో ఎన్.ఐ.ఎఫ్. ద్వారా రాష్ట్రపతి పురస్కారం పొందిన చంద్రశేఖర్ తాను తయారు చేసిన శ్రీశైలం బ్రాండ్ మంచి పేరు ప్రఖ్యాతులను సంపాదించింది. శ్రీశైలంను ఒకసారి కొన్నవారు మళ్ళీ మళ్ళీ కొనేంతగా ప్రాముఖ్యం పొందింది. అయినా అంతటితో ఆగకుండా, తన ప్రయోగాలను కొనసాగిస్తూనే వున్నారు.

పై ఇన్నోవేషన్లలో రైతులకు ప్రధానంగా ఉపయోగ పడేది 'నిమటోడ్స్' అనే పేరు పురుగు నివారణకై చంద్రశేఖర్ తయారు చేసిన 'నిమోటిసైడ్'. ప్రపంచంలో రైతులు ఈ నిమటోడ్స్ వల్ల ఎంతో నష్టపోతున్నారు. ముఖ్యంగా గ్రీన్‌హౌస్‌లో పంటలు పండించే రైతులు ఈ నిమటోడ్స్‌తో బాగా విసుగెత్తిపోతున్నారని రిటైర్డ్ నిమటోడ్ సైంటిస్టు డా. వరప్రసాద్ గారు తెలియచేశారు. మొక్క లేదా పంట చనిపోయేంత వరకు రైతుకు తన పొలంలో నిమటోడ్స్ పురుగు వున్న సంగతి తెలియదు. ఇంత వరకు ప్రపంచంలో వీటి నివారణకు రసాయన మందులే వాడుతున్నారు. వీటిని ఉపయోగించడం వల్ల పొలంలోని అన్ని జీవాలు పూర్తిగా చనిపోతాయి. రసాయన నిమోటిసైడ్ వల్ల రైతులకు బాధలు కొంచెమే. కానీ వాతావరణం, పొలంలోని ఇతర జీవ రాసులపై అధిక ప్రభావం వల్ల రైతు పెద్దమొత్తంలో నష్టపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి నిమటోడ్స్ వల్ల జరిగే నష్టం దాదాపు 158 బిలియన్ డాలర్లు అని ఒక నివేదిక తెలుపుతోంది. ముఖ్యంగా అమెరికా, ఫ్రాన్స్, చైనా, ఆస్ట్రేలియా దేశాల్లో నిమటోడ్స్ వల్ల దాదాపు 30% పంట రైతుల చేతుల్లోకి రావడం లేదు. మనదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 2 వేల కోట్ల రూపాయల పంట నష్టం జరుగుతుందని 'ఐసిఎఆర్' అంచనా.

చంద్రశేఖర్ కనిపెట్టిన నిమటోడ్స్ మూలికా మందు ఎంతో అద్భుతంగా పని చేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని వందలాది మంది రైతులు దీనివల్ల ఎంతగానో లాభపడ్డారు. వీరి అనుభవాలు 'పల్లెసృజన'లో పదే పదే ప్రచురించాము. ప్రపంచంలో ఇంతవరకు ఎవరూ తయారు చేయని ఈ నిమటోడ్స్ నివారణ మూలికా మందు వాడకం వల్ల పొలంలో మొక్కలు పది - పదిహేను రోజుల్లో తిరిగి పచ్చగా పెరగడం ప్రారంభమవుతుంది. రైతులు ఒక పంటను పూర్తిగా పోగొట్టుకోవాల్సిన అవసరం లేదు. ఒక్కసారి ఈ మందును ఇసుకలో కలిపి పంటలో వేస్తే దాని ప్రభావం 50 రోజుల వరకు ఉంటుందని, దీనివల్ల రెండు తరాల (30 రోజులకు ఒక తరం) నిమటోడ్స్‌ను చంపే అవకాశం వుంటుందని డా. వర ప్రసాద్ గారు వివరించారు. ఈ మందు తయారీ తర్వాత రెండు సంవత్సరాల వరకు వాడవచ్చు. ఇన్ని మంచి లక్షణాలున్న చంద్రశేఖర్ 'నిమోటిసైడ్' కు లైసెన్స్ రావాలంటే 'సి.ఐ.బి.' (సెంట్రల్ ఇన్‌సెక్టిసైడ్ బ్యూరో) వారిని సంప్రదించాలి. లైసెన్సు రావాలంటే చాలా టెస్టులు వారిచేత నిర్ణయించబడిన పరిశోధన శాలల్లో రకరకాల పంటలపైన చేయాల్సి వుంటుంది. దాదాపు ఖర్చు 40 లక్షల రూపాయలకు మించుతుందని అంచనా. మామూలు రైతు శాస్త్రజ్ఞుడైన చంద్రశేఖర్ గారికి అది సాధ్యమా? మరి రైతులకు ఇంత మంచి నివారణ మందు ఎలా అందుతుంది?

ప్రభుత్వం రైతు తయారు చేసిన విత్తనాలకు, మొక్కలకు గుర్తింపుకై ప్రత్యేక పద్ధతి ఏర్పాటు చేసింది. దీనివల్ల తక్కువ ఖర్చుతో స్వల్ప సమయంలో రైతులకు తమ ఇన్నోవేషన్లను రిజిష్టర్ చేయించుకొని గుర్తింపు పొందుతున్నారు. అలాంటి పద్ధతి రైతులు తయారు చేసే 'బయో పెస్టిసైడ్స్' (సేంద్రియ పురుగు మందులు) అంటే చంద్రశేఖర్ గారు తయారు చేసిన 'బయో నిమోటిసైడ్' లాంటి వాటికి వర్తింపచేస్తే త్వరలో ఈ ఇన్నోవేషన్లు రైతులకు అందగలవు. అంతవరకు స్థానిక వ్యవసాయ విశ్వ విద్యాలయాలు ఆ రైతుల ఇన్నోవేషన్లను ఒక ప్రాజెక్టు రూపంలో తగిన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం నుంచి తెప్పించి లైసెన్స్‌కై ప్రయత్నించాలి. అలాంటి రైతు శ్రేయస్సుకర కార్యక్రమాలు 'రెడ్ టేప్' లేకుండా అతి తక్కువ సమయంలో ముందుకు సాగాలి. 'పల్లెసృజన' అలాంటి ప్రభుత్వ చొరవలకు, విశ్వ విద్యాలయ ప్రాజెక్టులకు పూర్తిగా సహకారాన్ని అందిస్తుంది.

పంటలు కోతలు పూర్తయి రైతు ఇంటికి ధాన్యాలు వచ్చే ఈ శుభ సమయంలో అందరికీ శుభాభినందనలతో...



భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)



## నాణ్యత, సమర్థత కలిగిన

# కొప్పుల అశోక్ వీడర్

- అమ్మలయదరి శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

గుంటూరు జిల్లా, నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన ఏసురత్నం, శాంతమ్మల ఏకైక పుత్రుడు 'కొప్పుల అశోక్'కి ఒక అక్క, ఒక చెల్లెలుతో కూడిన ఉమ్మడి కుటుంబం. అతనికి ప్రసన్నతో వివాహమైంది, ముగ్గురు ఆడ సంతానం. అశోక్ చదివింది 10వ తరగతి వరకు మాత్రమే. అతని తండ్రి ఏసురత్నం క్రషర్ యంత్రం నడిపి జీవనం సాగించే వాడు. అక్కడ దుమ్ము ధూళిని తట్టుకోలేక ఆరోగ్య కారణాల వలన ఆ పని మానేసి కొంత పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. వీరికి స్వంతంగా పొలమేమీ లేకపోయినా కౌలుకు తీసుకున్న పొలంలో తండ్రితో పాటు అశోక్ కూడా కష్టపడి పని చేసేవాడు. తండ్రి క్రషర్‌లో పని చేసేటప్పుడు కూడా తండ్రితో పాటు అక్కడికి కూడా వెళ్ళి వెల్డింగ్ లాంటి పనులలో తర్ఫీదు పొందాడు. అలా బాగా తర్ఫీదు పొందిన తర్వాత స్వయంగా ఒక వెల్డింగ్ షాపును తన గ్రామానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోనున్న చిలకలూరిపేట మండలం, ఇర్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసుకున్నాడు.

తన వెల్డింగ్ షాపులో సమీప గ్రామాల రైతాంగం కొరకు చిన్న చిన్న పనిముట్లను తయారు చేస్తూ వుండేవాడు. వ్యవసాయంలో రానురాను ఎద్దుల పోషణ భారం కావటంతో మనుషులే స్వయంగా చేసుకునే విధంగా చిన్న చిన్న పనిముట్లు అతనిచేత చేయించుకునే వారు రైతులు. కాలక్రమంలో నడుచుకుంటూ చేతి పనిముట్లతో పొలం పనులు చేసే కూలీలు కూడా లభించటం కష్టమవటంతో కొందరు రైతులు ఈ పనులు చేసుకునేందుకు చిన్న చిన్న యంత్రాలతో కూడిన పనిముట్లు ప్రయత్నించమని అడిగేవారు. గ్రామంలో కొంతమంది ఎద్దులను పోషించు కుంటూ కిరాయికి వచ్చేవాళ్ళున్నా, వాటి కిరాయి భరించే శక్తి రైతుకు తగ్గిపోవటం, ఒకవేళ భరించ గలిగినా సరియైన అదునులో ఎద్దులు కిరాయికి లభించేవి కావు. ఈ సమస్యలన్నింటికి చిన్న చిన్న యంత్రాల తయారీ తప్పనిసరి అని గ్రహించాడు అశోక్.

వ్యవసాయ యంత్రాల తయారీ ప్రయత్నిద్దాం అని రెండు మూడు రకాల యంత్రాలను తయారు చేశాడు కానీ అవి తాను అనుకున్న విధంగా పని చేయకపోవటంతో మార్పులు



తనకున్న ఎద్దులను అమ్మేసి తన నాలుగు ఎకరాల పొలం పనులన్నింటినీ దీనితోనే చేసుకుంటూ రెండు సంవత్సరాల వరకు ఆ యంత్రంపై ఎటువంటి ఫిర్యాదులు చేయకుండా వ్యవసాయం సాగించాడు.

రెండు సంవత్సరాల తర్వాత తన యంత్రం పనితీరుపై సురేష్ అభిప్రాయం తెలుసుకోవాలని వెళ్ళారు. అప్పుడా రైతు తన పనులన్నీ దీనితోనే చేసుకుంటున్నానని, బొప్పాయి పంటలో చెట్లమధ్య ఎటువంటి కలుపు రాకుండా, ప్రత్తి, మిరప పంటల్లో కూడా అంతర సేద్యాలను ఎవరిమీద ఆధారపడకుండా తానే స్వయంగా చేసుకుంటున్నానని, దీనివల్ల నాకు చాలా శ్రమ, డబ్బు రెండూ ఆదా అయ్యాయి అన్నారు. ఇక ఇటువంటి పరికరాలు ఏ రైతుకైనా నిర్భయంగా చేసి ఇవ్వవచ్చు అన్నారు. కాకపోతే ఇంజన్ అమర్చే విషయంలో కాస్త జాగ్రత్త తీసుకుని సమర్థవంతమైన ఇంజన్‌ను ఉపయోగించు, చైనా ఇంజన్ల లాంటివి కాకుండా మంచి ఇంజన్‌లను వాటికి ఏ రైతైనా నమ్మకంతో తీసుకుంటారు అని సలహా ఇచ్చాడా మిత్రుడు.

ఇక అప్పటినుండి అశోక్ తనదైన శైలిలో వ్యవసాయ పనులన్నింటిని సమర్థవంతంగా పని చేసేలా 4 మరియు 5 హార్స్‌పవర్‌ల శక్తి గల ఇండియన్ ఇంజన్‌లతో 'వీడర్' తయారీ మొదలు పెట్టారు. ఇతను చేసే వీడర్ పూర్తయిన తర్వాత చూసే రైతుకు ఇది కార్పోరేట్ సంస్థలు తయారు చేసిన వాటికి ఏమాత్రం తీసిపోకుండా, అద్భుతమైన నాణ్యతతో చేయటం రైతులను ఎంతగానో ఆకట్టుకుంది. అంతటితో ఆగకుండా ఈ వీడర్ రైతుకు అన్ని రకాల పనులు చేసేలా తయారు చేశాడు. విత్తనం, ఎరువులు వేసుకోవటం, పొలంలో పంట నాటేందుకు అచ్చులు వేయటం, అంతర సేద్యాలు, చిన్న కారు రైతులు తమ మొత్తం పొలం పనులన్నీ దీనితోనే చేసుకునేలా చేయటమే

అవసరమని గ్రహించాడు అశోక్. తాను తయారు చేసిన యంత్రాలు పొలంలో దున్నేటపుడు కాస్త బరువు ఎక్కువ కావటం వల్ల ఆగిపోవటం, పని చేసే వ్యక్తికి శ్రమ అధికమవుతోందని తెలుసుకున్నారు. ఆ పరికరాలను ప్రక్కన పడేసి, వాటిలో వాడిన యంత్రాన్ని ప్రత్యేకం తీసి, గతంలో చేసిన యంత్రాలలోని లోపాలను సరిదిద్ది మరో పరికరాన్ని తయారు చేశాడు. ఈవిధంగా ఆరు రకాల యంత్రాలు తయారైన తర్వాత ప్రతి యంత్రానికి పాత వాటిలోని లోటుపాట్లను సవరిస్తూ చేసిన ఏడవ యంత్రం విజయవంతంగా తయారైంది. తనకు బాగా పరిచయమున్న సమీప గ్రామమైన రావూరు, లింగం పల్లి గ్రామాల్లో పొలం వున్న సురేష్ అనే రైతుకు ప్రయోగార్థం ఇచ్చి దీన్ని మీ పొలం పనులలో ఉపయోగించి ఇందులో ఇంకా ఏమైనా లోపాలుంటే చెప్పమని కోరటం జరిగింది. ఆ రైతు తన పనులను చేసుకుంటూ వుండగా చూసిన ఇతర రైతులు గమనిస్తారని, యంత్రం బాగా పని చేస్తుంటే రైతులే తమంతట తాము వచ్చి ఇలాంటిది మాకూ చేసి ఇమ్మని కోరుతారని, దానివల్ల తనకో జీవనోపాధి లభిస్తుందని ఆశించాడు. తాను అనుకున్నట్లుగానే సురేష్ అనే రైతు ఈ యంత్రం బాగా పని చేస్తుండటంతో



కాదు, ఈ వీడర్‌ను పొలంలో పనిచేసేందుకు అనువైన ఇనుప చక్రాలతో పాటు, పొలం పని అయిపోయిన వెంటనే తిరిగి వీడర్‌ను ఇంటికి సునాయాసంగా తీసుకుపోయే విధంగా తక్కువ సమయంలో చక్రాలు మార్చి టైర్లు వేసుకుని రోడ్డుపై తోలుకుంటూ హాయిగా వెళ్ళేలా తయారు చేశారు. ఈ వీడర్‌తో అన్ని రకాల పొలం పనులతో పాటు, పంటలపై పిచికారి చేసుకునేందుకు నీటిని తోడుకునేందుకు కూడా వినియోగించుకునే వెసులుబాటు కూడా కల్పించారు.

ఈ వీడర్ కేవలం 18 అంగుళాల వెడల్పు మాత్రమే వుంటుంది. కాబట్టి పైరు పెద్దగా పెరిగినా సరే ఎలాంటి పంట నష్టం జరగకుండా అంతర సేద్యాలు చేసుకోవచ్చు. పొలంలో దుక్కి పరికరాలు గొర్రు, గుంటకల వెడల్పు 30 అంగుళాల వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. అంటే పైన పైరుకు ఏమాత్రం ఇబ్బంది కలుగకుండా క్రింద భూమిని పెళ్ళ మొదళ్ళ వరకు దున్నుకుని కలుపు నివారించుకోవచ్చు. వీడర్ పొడవు ముందున్న చక్రాల నుండి వెనకనున్న గొర్రు వరకు 2 అడుగులు వుంటుంది, ఎత్తు కూడా రెండు అడుగుల వరకు ఉంటుంది. రైతులు తమ పంటలను తక్కువ వెడల్పులో విత్తుకున్నా, ఎక్కువ వెడల్పులో విత్తుకున్నా ఈ వీడర్‌తో సునాయాసంగా అంతర సేద్యాలు చేసుకుని, కలుపు నివారణ



చేసుకోవచ్చు. ఇది ఎంత సమర్ధవంతంగా పని చేస్తుందంటే రైతు ఎటువంటి అలుపు లేకుండా రోజుకు 8 ఎకరాల పొలంలో అంతర సేద్యాలు చేసుకోవచ్చు. కాస్త కష్టపడితే 10 ఎకరాల వరకు కూడా పొలం పనులు చేసుకోవచ్చు. ఎకరాకు కేవలం అర లీటరు డీజిల్ మాత్రమే ఖర్చవుతుంది.

పెద్ద రైతులు పెద్ద ట్రాక్టరుతో బాగా దుక్కి దున్నుకున్న తర్వాత ఈ వీడర్ యొక్క మూడు లేదా ఐదు పళ్ళ గొర్రుతో ఐదువాలు దుక్కి చేసుకుని, ఆ తర్వాత గుంటకతో మట్టి పెళ్లలు విరిగేలా పొలాన్ని విత్తుకు అనుకూలంగా చేసుకోవచ్చు. ట్రాలీని కూడా తయారు చేయించుకుని ఎద్దుల బండిలా దీన్ని వినియోగించుకోవచ్చు. ట్రాలీ తగిలించుకున్నప్పుడు ఈ వీడర్‌ను నడుపుకుంటూ తోలాల్సిన అవసరం లేకుండా ట్రాలీకి ఏర్పాటు చేసిన ఆసనంపై కూర్చుని హాయిగా తోలుకోవచ్చు. 8 క్వింటాళ్ళకు పైగా బరువును సునాయాసంగా లాగుతుంది వీడర్. అంటే రైతు తన పొలానికి అవసరమైన ఎరువులు, కూలీలను చేరవేయవచ్చు. పొలం నుండి పంటలను ఇంటికి తోలుకోవచ్చు. అంతే కాకుండా అవసరమైన రైతులు తమ పొలంలో బోరు కూడా దీనితోనే వేసుకోవచ్చు. పంపుసెట్టు లాగా 3 అంగుళాల పైపుతో నీటిని కూడా తోడుకోవచ్చు. పొలం అదునుకు బట్టి ఇనుప చక్రాలు లేదా టైర్లు రెండింటితో పొలం పనులు చేసుకోవచ్చు.

ఇంత చిన్న వీడర్‌లో ఎన్నో రకాల సౌకర్యాలు ఉండేలా చేయటం, తయారీలో కొన్ని పనులను చేసుకునే సౌకర్యం తనవద్ద లేకపోవటం వల్ల కొన్ని బైటనుండి చేయించుకోవాల్సి రావటంతో యంత్రం ఖరీదు కాస్త ఎక్కువ అవుతుందని, ఎవరైనా ఆర్థిక సహాయం అందించ గలిగితే ఈ వీడర్ తయారీకి చెందిన అన్ని రకాల యంత్రాలను కొనుగోలు చేయగ గలిగితే తానే స్వయంగా అన్ని పనులు చేసుకుని, తక్కువ ఖరీదుకే యంత్రాన్ని రైతులకు అందించ గలను అంటున్నాడు అశోక్.

కార్పొరేట్ పోటీలో నిలిచే విధంగా నాణ్యత, సమర్థత కలిగిన అశోక్ వీడర్ రైతు లోకానికి ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఈ ఇన్నోవేటర్‌కు అవసరమైన యంత్రాలను సమకూర్చేందుకు 'పల్లెసృజన' తప్పక కృషి చేస్తుంది. ●

**ఇన్నోవేటర్ అశోక్ ఫోన్ : 8297868863**

# కర్నూలు 'రైతు సదస్సు'లో 'పల్లెసృజన' ఇన్నోవేషన్ల ప్రదర్శన



- జమ్మలమడక శశిమోహన్

26 అక్టోబర్, 2019 నాడు కర్నూలు పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల సువిశాలమైన యస్.యస్. గార్డెన్స్ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో కర్నూలు జిల్లా పాణ్యం శాసన సభ్యులు శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి గారి చొరవతో 'శ్రీ యాగంటి స్వామి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ' ఆధ్వర్యంలో భారీయెత్తున 'ప్రకృతి వ్యవసాయదారుల సదస్సు' నిర్వహించడం జరిగింది. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచే కాక, దూర ప్రాంతాల నుండి కూడా నాలుగు వేల మందికి పైగా రైతులు పాల్గొన్న ఈ సదస్సుకు జిల్లాకు చెందిన ఇద్దరు పార్లమెంటు సభ్యులు – కర్నూలు యం.పి. డా. యస్. సంజీవ కుమార్, నంద్యాల ఎంపి శ్రీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఆరు మంది శాసన సభ్యులు – కర్నూలు శాసన సభ్యులు అబ్దుల్ హఫీజ్ ఖాన్, బనగానపల్లె శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి, నందికొట్కూరు శాసన సభ్యులు టి. ఆర్థర్, పత్తికొండ శాసన సభ్యురాలు శ్రీమతి కె. శ్రీదేవి, కోడుమూరు శాసన సభ్యులు డా. జె. సుధాకర్, గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కర్నూలు జిల్లా కలెక్టర్ జి. వీరపాండ్యన్ పాల్గొని సదస్సును నిర్వహించడంలో ముఖ్య భూమిక పోషించిన కాటసాని రాంభూపాల్ రెడ్డి గారిని అభినందిస్తూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి మరల్చాలని సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖకు చెందిన జె.డి. హార్టికల్చర్ పుల్లారెడ్డి, జె.డి. అగ్రికల్చర్ పి. విల్సన్, ఏ.డి. న్యాచురల్ ఫార్మింగ్ రామాంజనేయులు మరియు ఇతర అధికారులు పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయం పట్ల చొరవ చూపాలని సూచిస్తూ, 'పల్లెసృజన' ప్రదర్శించిన పునాది స్థాయి ఇన్నోవేషన్లు రైతాంగానికి ఎంతో ఉపయుక్తమైనవని తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన ఈ సదస్సుకి ముందునుంచి చొరవ చూపించటమే కాక, సదస్సులో 'పల్లెసృజన' కు చెందిన 20 మంది ఇన్నోవేటర్లు, 40 ఇన్నోవేషన్లతో ఉత్సాహంగా పాల్గొన్నారు. 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు ప్రదర్శించిన అన్ని ఇన్నోవేషన్లకు చక్కటి ప్రజాదరణ లభించింది. ముఖ్యంగా గుంటూరు జిల్లానుండి పాల్గొన్న ఇన్నోవేటర్లు అయిన మాచర్లకు చెందిన అశోక్



ప్రదర్శించిన, వ్యవసాయానికి సంబంధించిన అనేక పనులను చేసే ప్రత్యేకమైన వీడర్, కేవలం ఏడున్నర హార్స్‌పవర్‌ల డీజిల్ ఇంజన్‌తో తయారు చేసిన, చిలకలూరి పేటకు చెందిన పఠాన్ సైదా చిన్న ట్రాక్టరు, గుంటూరు పట్టణానికి చెందిన హరిబాబు తయారు చేసిన మినీ పంప్ సెట్, గుంటూరు జిల్లాకు చెందిన కొండాలు ప్రదర్శించిన మోటార్ సైకిల్ ట్రాలీ, అమరావతికి చెందిన అంటు ఇన్నోవేటర్‌లు నారాయణ రెడ్డి మరియు పాల్‌లు తయారు చేసిన చేతితో పనిచేసే ఒకే పరికరంగా వున్న గొర్రు, గుంటక రైతులను విశేషంగా ఆకర్షించాయి.

అదేవిధంగా పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరానికి చెందిన ఇన్నోవేటర్ విశ్వనాథ రాజు రూపకల్పన చేసిన "పంద గజాల్లో రోజుకు 15–20 కిలోల చేపలు పండించే ప్రత్యేకమైన 'ఆక్వా ఫార్మింగ్' పద్ధతిని రైతులంతో పాటు, ప్రదర్శన తిలకించిన నాయకులు, అధికారులు మన్ననలు పొందింది. ఆయనే కనిపెట్టిన 'క్లిక్ ప్లాంటర్'ను చూసిన రైతులు దీన్ని ఉపయోగించుకుంటే కూలీల ఖర్చుతో పాటు, నార నాటడం పని సులభంగా, క్రమ పద్ధతిలో అనుకున్న దూరంలో మిర్చి, పొగాకు, ఇతర కూరగాయల పంటలను నాటుకోవచ్చు అని చర్చించుకున్నారు.

మహబూబాబాద్ జిల్లాకు చెందిన అంజయ్య తయారు చేసి, ప్రదర్శించిన 'అడవి పందులను పారద్రోలే సైరన్' ఆ ప్రాంత రైతులను విశేషంగా ఆకర్షించింది. ఇన్నోవేటర్లలో అతి చిన్న వయస్సుడైన (15 సంవత్సరాలు) గొర్రె అశోక్ తయారు చేసిన పరిమళ్ళల్లో కలుపు, వరిక మొక్కలను సులభంగా, వంగకుండా, ఎలాంటి అలుపు లేకుండా తీసివేసే చిన్న పరికరం చూసి రైతులు "అరె! మన



రైతుల సమస్యలకు ఇంత సులభమైన పరిష్కారాలు కనిపెట్టిన వారికి వెలుగులోకి తెచ్చిన 'పల్లెసృజన' గొప్పదనాన్ని వేనోళ్ళ పొగిడారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కొడిముంజ ప్రవీణ్ రూపొందించి తీసుకు వచ్చిన నాలుగు హార్స్‌పవర్‌ల సామర్థ్యం గల అంతర సేద్యాలకు పనికి వచ్చే వీడర్‌ను రైతులు ఎంతో ఆసక్తితో నడిపి చూశారు.

చిత్తూరు జిల్లాకు చెందిన ఇన్నోవేటర్ గురుమూర్తి తయారు చేసిన బోరు బావిలోనే పైపులకు రంధ్రాలు వెయ్యటం ద్వారా భూమి పై పొరలలో వున్న నీరు కూడా బోరుబావిలోకి వచ్చి తక్కువ నీరున్న బోర్ల వల్ల ఇబ్బంది పడే రైతాంగ సమస్యలు తీర్చే ఇన్నోవేషన్ యావత్ సందర్శకులను ఆకర్షించింది. కర్నూలు జిల్లాకు చెందిన ఇన్నోవేటర్ వెంకట కృష్ణుడు తయారు చేసిన సేంద్రియ పురుగు మందులు, మొక్కల ఎదుగుదలకు తోడ్పడే మందులు చూసిన రైతులు సేంద్రియ వ్యవసాయంపై నిర్వహించిన సదస్సులో ఇవి కూడా అమ్మటం ఎంతో ముదావహం అన్నారు.

ఇంకా ప్రదర్శనలో పాల్గొన్న ఇతర ఇన్నోవేటర్లు విజయవాడకు చెందిన ఇన్నోవేటర్ జలీల్ తయారు చేసిన





పూనా వైర్ల నుండి లోహాలను, ప్లాస్టిక్‌ను వేరు చేసి తీసే యంత్రం, తూర్పు గోదావరి జిల్లా ఇన్నోవేటర్ నాగశ్రీనివాస్ వరిలో కలుపు తీసే పరికరం, పశ్చిమ గోదావరి జిల్లా పార్వతీపురం ఇన్నోవేటర్ బాబూరావు వివరించిన వివిధ ఇన్నోవేషన్లు, మహబూబాబాద్ జిల్లా ఇన్నోవేటర్ షణ్ముఖరావు తయారు చేసిన కూర్చుని నడిపే ఒంటి చక్రం వీడర్, నల్గొండ జిల్లాకు చెందిన పంతిరి పుల్లారెడ్డి రెండు బోర్లను ఒకే మోటారుతో నడిపే పద్ధతి, శ్రీకాళహస్తికి చెందిన చంద్రశేఖర్ తయారు చేసిన శ్రీశైలం, నిమటోడ్స్ నివారణ పురుగు మందు, పూనా ఇన్నోవేటర్ నిహాల్ తయారు చేసిన చేతితో కలుపు తీసే 'కుర్పీ' పరికరం లాంటి ఎన్నో ఇన్నోవేషన్లను సందర్శకులు ఆసక్తిగా తిలకించి వివరాలు తెలుసుకోవడమే కాకుండా, కొనుగోళ్ళు కూడా చేశారు.

మాకు ప్రక్కనే తుంగభద్రానది అవతల ఇంత చక్కని రైతు సదస్సు జరుగుతుందని తెలుసుకొన్న గద్వాల శాసన సభ్యులు శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు, జిల్లా మండలాధ్యక్షులు తిరుమల్ రెడ్డి గారు తమ కార్యక్రమాలను కూడా వాయిదా వేసుకుని కేవలం సదస్సు చూడటానికి, ఇన్నోవేటర్లను అభినందించడానికి ప్రత్యేకంగా మధ్యాహ్నం సమయానికి చేరుకోవటం విశేషం.

అద్భుతం పండగ వాతావరణంలో జరిగిన సదస్సు/ ఇన్నోవేషన్ల ప్రదర్శనలో భోజనానంతరం మధ్యాహ్న కార్యక్రమంలో హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా విచ్చేసిన చింతల వెంకట్ రెడ్డి గారు తాను అనేక వ్యయ ప్రయాసలకోర్చి కనుగొన్న, ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాక, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, తమిళనాడు, కర్నాటక, కేరళ మొదలైన అనేక రాష్ట్రాలలో రైతులు ఎంతో





లాభసాటిగా పాటిస్తున్న "మట్టి వ్యవసాయ పద్ధతి" గురించి సోదాహరణంగా వివరించారు. దీని వలన సదస్సులో పాల్గొన్న అనేకమంది రైతులలో ఈ బూజైన పద్ధతిపైన అనేక వివరాలు తెలియటంతో పాటు సందేహ నివృత్తికి కూడా తోడ్పడింది. అనేక సంవత్సరాలు ఓర్పుగా పరిశోధించి, కొన్ని లక్షల రూపాయలు ఖర్చు చేసి తాను కనుగొన్న 'మట్టి వ్యవసాయ పద్ధతి'కై ప్రపంచంలోని చాలా దేశాల్లో పేటెంటు హక్కులు పొందివుండి కూడా, ఇప్పుడు ఆ పద్ధతిని దేశ రైతాంగానికి ఉచితంగా అంకితం చేశానని చెప్పారు. దేశంలోని నలుమూలల చాలామంది చేస్తున్నట్లు తన పద్ధతి పాటించి లాభం పొందిన రైతులు తనకి కేవలం తెలియజేస్తే సంతోషిస్తానని, ఎప్పుడు కావాలంటే అప్పుడు ఫోన్‌మీదనైనా సరే కావలసిన సలహాలు ఇస్తానని/ ఇస్తున్నానని చెప్పినపుడు సదస్సు ప్రాంగణం రైతుల హర్షధ్వానాలతో మార్మోగిపోయింది.

తదనంతరం 'పల్లెసృజన' పత్రిక సంపాదకులు బి. శశిమోహన్ మాట్లాడుతూ "పల్లెసృజన చేస్తున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయి, జనులకి ప్రత్యేకించి రైతులకి ఎంతో



ఉపయోగకరమైన సమాచారాన్ని సేకరించి, ధృవీకరించి చేరవేస్తున్నారు అని చెప్పేందుకు చాలా ఆనందంగా ఉంది. 'పల్లెసృజన' బృందం తరుపున మీ అందరికీ కృతజ్ఞతలు. ఒక్క విన్నపం మేము చేస్తున్న పని నలుగురికీ మేలు చేసేదే అని మీరు భావించినట్లయితే మీ చుట్టు ప్రక్కల ప్రాంతాలలో నలుగురికీ మేలు చేసే ఏదైనా ఒక ఆలోచన కాని, ఇన్నోవేషన్ కాని మీ దృష్టికి వచ్చినట్లయితే దయచేసి 'పల్లెసృజన'కు తెలియజేస్తే దానిని నలుగురికీ తెలియజేసే ప్రయత్నం చేస్తాము. అంతే కాక 'పల్లెసృజన' పత్రిక రైతులకి ఎంతో విలువైన సమాచారం అందజేస్తోంది అని మీరంతా అన్న తర్వాత మాదొక చిన్న కోరిక. ఈ పత్రికను రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు చేరవేయడానికి మీ సహాయం కోరుతున్నాము" అన్నారు. దీనికి స్పందనగా వేదికపైనున్న శాసన సభ్యులు శ్రీ రాంభూపాల్ రెడ్డిగారి సూచన మేరకు స్థానిక వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ శ్రీ పి. విల్సన్ గారు 'పల్లెసృజన' పత్రిక కర్నూలు జిల్లాలోని అన్ని గ్రామాలకు చేరవేసే బాధ్యత కలెక్టరు గారి సహాయంతో చేసేందుకు తప్పకుండా ప్రయత్నిస్తామని అన్నారు.

ఈ పూర్తి కార్యక్రమానికి మూల కారకుడు పల్లె వీరరాఘవ రెడ్డి గారు. ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి గారితో చర్చలు జరిపి ఆయనచేత 'పల్లెసృజన' గురించి ఆంధ్రప్రదేశ్ శాసన సభలో మాట్లాడటం నుంచి ఈ ఇన్నోవేషన్ల ప్రదర్శన వరకు నిర్విరామంగా కష్టించి, అందరితో సంప్రదింపులు చేస్తూ, సుభాష్ చందర్ సహకారంతో అతి ప్రభావవంతమైన కార్యక్రమాన్ని పల్లెసృజన తరుపున సాధ్యం చేశారు.

ఈ రైతు సదస్సుని ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి నిర్వహించిన పాణ్యం శాసన సభ్యులు శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి గారు తమ ఆహ్వానాన్ని మన్నించి ఈ రైతు సదస్సులో పాల్గొన్న అధికారులకి, అనధికారులకి ప్రత్యేకించి 'పల్లెసృజన'కు ధన్యవాదాలు తెలుపుతూ ఈ సదస్సులో పాల్గొన్న ఇన్నోవేటర్లు అందరినీ ఘనంగా సత్కరించారు. ఒక మంచి కార్యక్రమంలో పాల్గొన్నామన్న సంతృప్తి 'పల్లెసృజన'కు మిగిలింది. ●

**ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి రైతు సదస్సులు ఏర్పాటు చేయాలి అనుకునేవారు వెంటనే సంప్రదించండి :**

**వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904/ 79890 38186**

**బ్రిగేడియర్ గణేశం, ఫోన్ : 9866001678**





# ఊర పందుల నుండి పంటను రక్షించే సివిఆర్ విధానం

'పల్లెసృజన' పరిచయం చేస్తున్న "చింతల వెంకట్ రెడ్డి", మట్టి వ్యవసాయ సృష్టికర్త 'సి.వి.ఆర్.' పేరుతో చిరపరిచితులే. వీరి పొలం హైదరాబాద్ అల్వాల్ లోని జనావాసాల మధ్యన కొంత వుంది. అందులో ఎక్కువగా వరి, గోధుమ పంటలు వేస్తూ వుంటారు. ఆ పొలం ప్రక్కనే కొంత ఖాళీ స్థలం వుండటం, అక్కడ మురుగు నీరు ఎక్కువగా వుండటంతో సాధారణంగానే పందులు కూడా వీరవిహారం చేస్తూ వుంటాయి. అవి ప్రక్కనే వున్న సివిఆర్ గారి పొలంపైన పడి పంటను నాశనం చేస్తూ వుండేవి. మనుషులను పెట్టి తోలించినా ఎప్పుడో ఒకప్పుడు మనుషులను ఏమార్చి పొలం లోని పంటను నాశనం చేస్తూ వుండేవి. దీనికేదైనా ఉపాయం కనుగొనాలి అని ఆలోచించారు స్వతహాగానే ఇన్నోవేటర్ అయిన వెంకట్ రెడ్డి.

పొలం చుట్టూ కరెంటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయిద్దాం అనుకుంటే ప్రక్కనే జనావాసాలు వుండటంతో అక్కడ ఎవరైనా చిన్న పిల్లలు దానిని ముట్టుకుని ప్రమాదానికి గురి అయ్యే అవకాశం వుంటుంది అని ఆ ప్రయత్నాన్ని విరమించు కున్నారు. ఆ తర్వాత ఆయనకు ఒక ఆలోచన వచ్చింది. వెంటనే తన పొలంలో పందులు ఎక్కువగా వచ్చే వైపు ఒక ఫెన్సింగ్ ఏర్పాటు చేయించి, దానికి కొద్దిసేపు కరెంటు సరఫరా ఇచ్చారు. ప్రక్కనే పందులకు కనబడకుండా ఒక మనిషి దాగుండే ఏర్పాటు చేసి అతనికి ఒక సెల్‌ఫోన్ ఇచ్చి, పందులు ఆ కంచెను దాటేటప్పుడు వాటికి కరెంట్ షాక్ వచ్చి విపరీతంగా అరుస్తాయి, వాటిని రికార్డు చేయమని చెప్పారు.

కాపలా వున్న వ్యక్తి అలాగే అని, పందుల కోసం ఎదురు చూస్తూ వుండగా పందులు వచ్చాయి. వెంటనే సెల్‌ఫోన్‌లో రికార్డును ఆన్ చేసి వుంచారు. సివిఆర్ గారు చెప్పినట్లే పంది ఆ కంచెను దాటబోయి, కరెంటు షాక్‌తో విపరీతంగా అరవ సాగింది. తన ప్రయత్నం ఫలించిందని అప్పుడు కంచెకు ఏర్పాటు చేసిన కరెంటు సరఫరాను నిలిపివేశారు. పొలం ప్రక్కనే తన ఇల్లు వుండటంతో ఆ రికార్డు చేసిన శబ్దాన్ని ఒక పెద్ద స్పీకర్‌లో అప్పుడప్పుడూ వినిపించేలా ఏర్పాటు చేశారు. ఇక ఆ శబ్దాన్ని విన్న పందులు ఆ పరిసరాల్లోకి రావడం మానేశాయి.

ఇందులో సివిఆర్ గారి ఇన్నోవేషన్ ఏమిటంటే, పంది భయంతో అరిచే అరుపు అప్పుడప్పుడూ వినిపించడం వల్ల అక్కడ తమకేదో ప్రమాదం పొంచి వుంది అని గ్రహించి పందులు ఆ వైపుకు రావటం మానేస్తాయి. "చిన్న చిట్కా చాలా మంచి పని చేసింది కదూ"! మీరూ ప్రయత్నించండి. లేదా చింతల వెంకట్ రెడ్డి గారిని ఆడియో రికార్డింగ్‌కై సంప్రదించండి.

- వీరరాఘవ రెడ్డి


చింతల వెంకట్ రెడ్డి (సివిఆర్) ఫోన్ : 9866883336

## ఎన్.ఆర్.ఐ. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.ఐ. (నాన్ రెసిడెంట్ ఇండియన్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మమకారం వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 1,000/-లతో 5 సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక వారి గ్రామాలకు వచ్చే ఏర్పాటు చేస్తారు. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని అన్ని గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని ఆశిస్తున్నాము.

-ఎడిటర్



మీ చందాను పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు :
M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023
నగదు చేసిన తర్వాత మీ చిరునామాను పూర్తిగా ఎస్.ఎం.ఎస్. లేదా ఇ-మెయిల్ చేయండి.
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా 'ఫోన్ పే' ఉపయోగించుకున్న వారు 9866 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్సాప్‌లో పంపండి.

## సిసలైన 'కారణ జన్ముడు'

# అన్నం శ్రీనివాస రావు



- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

ఈ కథ ఇన్నోవేషన్‌లకు సంబంధించినది కాదు. కానీ, మానవత్వం ఈ రూపంలో కూడా వుంటుందా?, ఇలాంటి సమాజ సేవకులు కూడా ఉన్నారా?, అసలు మనిషికి ఇలాంటి సేవలు చేయడం సాధ్యమా? లాంటి ఎన్నో ప్రశ్నల సుడిగుండాలలోకి మిమ్మల్ని తీసుకు వెళ్ళే కథ. 'సమాజ సేవకు పరాకాష్ట' ఇదే అని ఖమ్మం జిల్లా కేంద్రంలో "అన్నం ఫౌండేషన్" అందిస్తున్న సేవలను చూస్తే ప్రతి ఒక్కరూ అనుకునే మాట. అన్నం ఫౌండేషన్‌ను సందర్శించడం ఒక భాగ్యంగా అనిపించింది "పల్లెసృజన" బృందానికి. "అన్నం శ్రీనివాస రావు" అనే ఒక వ్యక్తి తన జీవన యానాన్ని నిస్వార్థ సేవతో సాగించడం అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేస్తుంది. ప్రతి హృదయాన్ని కదిలిస్తుంది. ఆయన అందిస్తున్న సేవా కార్యక్రమాలలో మచ్చుకు కొన్నింటిని ఇక్కడ వివరిస్తున్నాం.

మన ఇంట్లో ఎవరైనా ఒక్క 'మతి స్థిమితం' లేని వ్యక్తి వున్నట్లయితే వారిపట్ల ఎంత జాగ్రత్తగా శ్రద్ధ తీసుకున్నా, ఏ సమయంలో ఎలాంటి ప్రమాదంలో పడతారో అని భయపడుతుంటాము. వారికి సపర్యలు చేయటానికి కూడా చాలా ఇబ్బందిగానే అనిపిస్తూ వుంటుంది. మన స్వంత మనిషికి అందించే సేవలలోనే ఎప్పుడో ఒకసారి ఓర్పును కోల్పోతూ వుంటాము. అలాంటిది అన్నం శ్రీనివాస్ ఏకంగా 275 మంది అనాథలకు ఎక్కడా ఓర్పు కోల్పోకుండా అన్నీ తానై చూసుకుంటున్నారు అంటే ఆ సేవా భావాన్ని ఏమనాలి? అందులో దాదాపు 150 మందికి పైగా 'మతి స్థిమితం' లేనివారే అంటే ఇది నమ్మటం సాధ్యమా? అనిపిస్తుంది. ప్రత్యక్షంగా చూసిన వారికి తప్ప ఇది నమ్మటం అంత సులభ సాధ్యం కాదు. కానీ ఇది నిజంగా 'నిజం'.

ఖమ్మం పట్టణంలో మతి స్థిమితం లేని 'యాచకులు' ఎవరైనా కనిపిస్తే చాలు అన్నం శ్రీనివాస్ అతన్ని తనతో పాటు తీసుకు వస్తారు. సాధారణంగా అటువంటి వ్యక్తుల తలకు తైల సంస్కారం వుండదు, చింపిరి జుట్టు, మాసిన బట్టలు అనేకంటే, అవి బట్టలా లేదా రెండవ చర్మమా అనిపించేంతగా వుంటాయి. పైగా విపరీతమైన దుర్గంధంతో కూడి వుంటారు. అటువంటి వ్యక్తులను (ఆడైనా, మగైనా) తీసుకు వచ్చి, సహాయకుల సహకారంతో తానే స్వయంగా జుత్తును క్షవరం



చేసి, స్నానం చేయించి, తనవద్ద వున్న ఆ వ్యక్తికి తగిన గుడ్డలు కట్టించి 'ఒక కొత్త రూపం' ఇస్తారు. ఇక అప్పటినుండి ఆ వ్యక్తి అక్కడే భోజనం, ఆట, పాట, పడుకోవడం అన్నీ 'అమ్మ ఫౌండేషన్' లోనే.

మతిస్థిమితం లేనివారి సంరక్షణలో అనేక ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంటుంది. ఒకటి వారిపై వారికి నియంత్రణ లేకుండా ఉన్మాదిలా ప్రవర్తించటంలో భాగంగా చేతికి అందిన వస్తువులను విసిరివేయటం, కొట్టటము, కొరకటము లాంటి చర్యల నుండి మనలని, సంరక్షకులని రక్షించుకోవటం ఒక పంథైతే, మతి స్థిమితం లేని వ్యక్తులు ఆ ఉన్మాద పరిస్థితులలో తమకి తాము హాని చేసుకునే చర్యల నుండి కూడా వారిని కాపాడటం. దీనికోసం అవసరమైతే కొంత కాలం వారిని సంకెళ్ళతో బంధించవలసి రావచ్చు. హైదరాబాద్ ఎర్రగడ్డలో ఉన్మాదుల కొరకు వున్న ప్రత్యేక వైద్య శాలలోని నిపుణులైన వైద్యుల సలహాలు, సహాయము అదేవిధంగా స్థానికంగా వున్న అనేకమంది వైద్యుల సలహాలు నిత్యం తీసుకోవటం కూడా చేస్తూ వుంటారు.

ఆశ్రమంలో వున్న మానసిక రోగులకి వైద్య సహాయం తో పాటు, శుచికరమైన, కావాల్సిన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించటంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వుంటారు శ్రీనివాసరావు. దీనికై దాతలు కొందరు తమ ఇళ్ళల్లో పర్వదినాలు, శుభ దినాల్లో వీరితో కలిసి జరుపుకోవటానికి అన్నదాన రూపంలో సహాయం చేస్తూ వుంటారు.

ఇంతమంది మానసిక స్థితి బాగా లేనివారు ఒకేచోట వుండటం వారు అనేక ఆరోగ్యపరమైన సమస్యలతో బాధ పడుతూ వుండటం వలన ఈసమస్యలు పరిష్కారానికి సామాజిక స్పృహ వున్న కొందరు సంఘ సేవకులు, వైద్యులు, అనుబంధ సంస్థలతో ప్రమేయమున్న వ్యక్తులతో కలిసి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయటం, ఆ శిబిరాలలో ఆశ్రమంలో వున్న ప్రతి ఒక్క వ్యక్తి ఆరోగ్యాన్ని పరీక్షించి, అవసరమైన వ్యక్తులకు ఔషధాలు అందజేయటం తప్పనిసరి పరిస్థితులలో బయటనుండి నిష్ణాతులైన ప్రత్యేక వైద్యులచే చికిత్స ఇప్పించటం జరుగుతూ వుంటుంది.

ఏం మాయ చేస్తారో, ఏ వైద్యానికి వారు లొంగుతారో తెలీదు కాని, కొందరు వ్యక్తులు మామూలు వ్యక్తులుగా మారి, వారి గతాన్ని మొత్తం వివరిస్తే, వారిని వారివారి స్వగృహాలకు చేర్చిన ఘటనలు కూడా కోకొల్లలు. ఇలాంటి వ్యక్తులు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర రాష్ట్రాల, ఒకప్పుడు ఇతర దేశాల వారు కూడా ఎన్నో వున్నారు.

ఆశ్రమ వాసులకి వైద్య సహాయంలో భాగంగా మానసిక చికిత్స చేసే క్రమంలో వారికి ఆట పాటలు, భజనలు, పాటలు, సంకీర్తనలు, నృత్యాలు మొదలైన ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతూ వుంటుంది. కొన్ని సందర్భాలలో ఆశ్రమవాసులు పాటలు పాడి, నృత్యాలు చేస్తున్న సందర్భంలో తమ గతం గుర్తుకు వచ్చి వారి వారి ఇళ్ళకు చేర్చబడిన సందర్భాలు కూడా వున్నాయి.

ఈ ఆశ్రమంలో వున్న అనాథలకు సేవలు చేసే వ్యక్తులు కూడా ఏదో ఒక బాధతో అక్కడికి వచ్చి, పునర్జీవితం పొందిన తర్వాత సేవకులుగా మారి, అనాథల పట్ల అచంచలమైన సేవా భావంతో పని చేస్తున్న వారే. అటువంటి వారిలో అక్కడ సేవలు అందిస్తున్న వారు ఎందరో ప్రేమ, ఆదరణలతో సేవలు అందజేస్తున్నారు.

పేరుకి చిత్త చాంచల్యం కలిగినవారు అయివున్నా, వున్నంతలో క్రమశిక్షణ పాటించడం, భోజనానికి క్రమపద్ధతిలో రావటం, ఇది కావాలి, ఇది వద్దు అని అడిగి





పెట్టించుకోవటం, నిలబడి వరుసలో రాలేని వారికోసం కొందరు తీసుకొని వెళ్ళి పెట్టడం, తినలేని వారికి కలిపి ముద్దలు తినిపించటం .... ఇది ఇప్పటి కథ అయితే, ఆశ్రమానికి రాకముందు పిచ్చివాళ్ళలా శైల సంస్కారం లేని జుట్టుతో గడ్డాలు, మీసాలు పెంచుకొని, ఒంటిమీద గుడ్డ ఉందో లేదో అన్న స్పృహ లేకుండా జనాల వెంట రాళ్ళు విసురుతూ, పరిగెడుతూ, జనాలు రాళ్ళతో కొడితే తాము పరిగెడుతూ, నవ్వుతూ, ఏడుస్తూ, అరుస్తూ.... ప్రజలని భయభ్రాంతులను చేసింది వీరేనా? అనిపిస్తుంది. ఈ మార్పుని సుసాధ్యం చేసిన ఘనత కేవలం 'అన్నం శ్రీనివాస రావు', ఆయన సిబ్బందిదే.

సమాజంచేత వెలివేయబడి, పిచ్చివాళ్ళు అని ముద్ర వేయబడిన వ్యక్తులని వెతికి, ఏరి, అనాథాశ్రమంలోకి తీసుకు రావటం ఒక భాగమైతే, వారిని సంరక్షించి, వైద్య సహాయం అందించి సంస్కరించడం రెండవ భాగమైతే, వాళ్ళ పూర్వాపరాలు సేకరించి, వారివారి ఆప్తుల వద్దకు చేర్చటం శ్రీనివాస రావు చేసే ముఖ్య కార్యక్రమం.

ఖమ్మం జిల్లాకే చెందిన ఒక వ్యక్తి ఒకప్పుడు హమాలీ. తన ఒంట్లో శక్తి వున్నంత వరకు తన కుటుంబం కోసం కష్టపడి సంపాదించి అందరినీ ఆదరించాడు. అతను విధి వంచితుడైతే అదే కుటుంబ సభ్యులు వెలివేశారు. అతను తన స్థితికి దాదాపు మతి స్థిమితం లేనివాడుగా మారి ఊర్లో అడుక్కు తింటూ వున్న పరిస్థితుల్లో 'అన్నం శ్రీనివాస రావు' ఆదరించి అతనికి ఊరట కల్పించి తన ఆశ్రమంలోకి తీసుకు వచ్చిన కొద్ది రోజులకే తాను 'సత్యాన్ని గ్రహించి' ఇక నాకు కుటుంబం అవసరం లేదు, నేను నా చివరి ఊపిరి వరకు ఇక్కడే వుంటాను అని తనకు గతంలో అనుభవమున్న వంటలు చేయటాన్ని ఇక్కడ వృత్తిగా స్వీకరించి, ప్రస్తుతం ఇక్కడున్న అనాథలందరికీ తానే స్వయంగా వంటలు చేస్తున్నాడు. అతని గాథ విన్న 'పల్లెసృజన' అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు ఆయనను సన్మానించి తనవంతు ప్రోత్సాహాన్ని అందించారు.

అన్నం శ్రీనివాస్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమం అనితర సాధ్యమైంది అని చాలామందికి అనిపిస్తుంది. కానీ, ఇంతకు మించిన సేవా కార్యక్రమం కూడా చేస్తారు శ్రీనివాస రావు ఆయన చేస్తున్న ఆ పనిని చూడటం కాదు, వినటానికి కూడా చాలా మందికి మనసొప్పదు. ఒళ్ళు గగుర్పొడిచే సంఘటనలు అవి. వాటిని ప్రస్తావించటానికే కష్టంగా వుంటుంది. ఇక ఫొటోలను, వీడియోలను చాలామంది అస్సలు చూడలేరు. అదే ఆయన చేస్తున్న మరో గొప్ప సేవ అనాథ శవాలకు దహన సంస్కారం.

ఖమ్మంలో పారే నదుల్లో, కుంటల్లో, మురికి కాలువల్లో ఎన్నో రకాల శవాలు కనిపిస్తూ వుంటాయి, ఆ వ్యక్తులు ఆత్మహత్య చేసుకుని వుండవచ్చు, ప్రవాహంలో కొట్టుకొని వచ్చి వుండవచ్చు, హత్య గావించ బడినవారు





ఉండవచ్చు. అలాంటి శవాలు కొన్ని రోజుల తర్వాత ఎవరో ఒకరు వాళ్ళను పోలీసులు లేదా పురపాలక శాఖ వారికి చేరవేస్తారు. అటువంటి వాటిలో కొన్ని శవాలు సగం హరించుకు పోయి, పురుగులు పట్టినవి, సగం శవం కేవలం ఎముకలు, కొంత మాంసంతో కూడినవై ఉంటాయి. అటువంటి వాటిని ఎవ్వరైనా సరే కొన్ని క్షణాల పాటు అదీ ముక్కు, నోరు మూసుకుని కాని చూడటం సాధ్యం కాదు. అటువంటి శవాలను తానొక్కడే ఒక గుడ్డలోకి మార్చి, మూట కట్టి, తన ఆటోలోనే వేసుకుని వెళ్ళి, సాంప్రదాయంగా దహన సంస్కారాలు చేస్తూ ఉంటారు.

ఒక్కోసారి రోడ్డుపైన ప్రమాదాల్లో కొందరు మరణిస్తూ ఉంటారు. అటువంటి వారిలో కొన్ని శవాలను మామూలు వ్యక్తులకు చూడటం కూడా సాధ్యం కాదు. అటువంటి వాటిని కూడా తాను, తన తోటి సేవకులైన 'సరస్వతి, ఈశ్వరి'ల సహకారంతో వారిని ఎత్తి, మూట కట్టి, ఆసుపత్రి మార్చురీకి చేరుస్తూ ఉంటారు అన్నం శ్రీనివాస్. అటువంటి వారి శవాల కోసం ఒక్కోసారి ఎవరూ రారు. వారికి తానే దహన సంస్కారాలు నిర్వహిస్తూ ఉంటారు. ఇలాంటి సంఘటనల్లో ఒక సంఘటన మమ్మల్ని కలచి వేసింది. ఒక భార్య, భర్త మోటార్ సైకిల్‌పైన వెళ్తూ ఉంటే ఒక లారీ గుద్దడంతో ఆ ప్రమాదంలో భార్య తలపైన వాహనం టైర్లు పడి తల సగం వరకు ఛిద్రమైంది. రోడ్డంతా రక్తం, ఆమె మెదడు, పేగులు పడిపోయాయి. అటువంటి స్థితిలో పురపాలక శాఖ సిబ్బంది, ఆమె భర్త కూడా ఆ శవం వైపుకు చూడలేక తల తిప్పుకుంటే, అన్నం శ్రీనివాస్, ఈశ్వరి, సరస్వతిలు మొత్తం శరీర భాగాలను సేకరించి, ఒక మూటలో భద్రంగా కట్టి, తమ వాహనంలోనే ఆసుపత్రికి చేర్చడం చూస్తే కాదు, వింటే కూడా కొద్దిసేపు మనసు కకావికలం అవుతుంది. తేరుకుండా ఉంటుంది.

మామూలుగా కొన్ని పట్టణాల్లో కొందరు ఇటువంటి శవాలను వెలికి తీసేవారు ఉంటారు. కానీ వారు ఇటువంటి పని చేయాలంటే తప్పక మద్యం సేవించాల్సిందే అంటుంటారు. కానీ, శ్రీనివాస్‌కు మద్యం అలవాటే లేదు. కుళ్ళిన శవాలను ఎవ్వరైనా చూస్తే వాసన భరించలేక ముక్కు మూసుకుంటారు, కానీ, ఆయన ముక్కు, నోటికి ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా, కేవలం చేతులకు మాత్రం తొడుగులు వేసుకుని శవాలను తీసివేస్తూ ఉంటారు. చనిపోయిన ఎంతటి భారీ వ్యక్తి శవాన్నయినా ఒక్కడే సులభంగా లేపి, మూటలోకి చేరుస్తారు. అంత పెద్ద శవాన్ని ఎలా లేపుతున్నారంటే, బరువుండదా అంటే, "నాకెందుకో బరువు, వాసన అనిపించవంటే, ఎటువంటి శవాన్ని తీయటమైనా ఒక మామూలు పనిగానే అనిపిస్తుంది. ఒక్కోసారి శవాన్ని పురుగులు గుంపులు గుంపుగా తినేస్తూ ఉంటాయి. అవి తెల్లగా ఉండి పాకుతూ ఉంటాయి. అటువంటి పురుగులు నా పైకి కూడా ఎక్కుతూ ఉంటాయి, అటువంటప్పుడు మాత్రం కాళ్ళు, చేతులు విదిలిస్తూ పని చేసుకుపోతూ ఉంటాను. అంతే తప్ప నాకేదో ప్రత్యేకమైనది, జుగుప్సాకరమైనది అన్న భావన కలుగదు" అని చెబుతున్న ఆయనను చూస్తే అక్కడ మాతో పాటు సందర్శించిన కొందరు స్థానికులు "ఈయన మా ఖమ్మంలో నడిచే దేవుడు" అన్న మాట వాస్తవమే కదా అనిపించింది.

ఖమ్మం పట్టణంలో పోలీసు, పురపాలక శాఖ, ఆసుపత్రి సిబ్బందికి ఇటువంటి జుగుప్సాకర స్థితిలో ఉన్న







శవాలు (అవి జంతువులవి అయినా సరే) కనిపిస్తే వెంటనే వారికి గుర్తొచ్చే పేరు "అన్నం". వెంటనే ఆయనకు ఫోన్ చెయ్యండయ్యా, మనవల్ల కాదులే ఈ శవాన్ని తీయటం అంటారు.

గత 30 సంవత్సరాలుగా ఇటువంటి వ్యక్తి నడుపుతున్న ఆశ్రమానికి ఒక దాత తన స్థలాన్ని వాడుకోమ్మంటే, మరో దాత అందులో షెడ్డును వేసి ఇచ్చారు. ఇంకొందరో దాతల సౌజన్యత్వం, దయా గుణాల వల్ల అక్కడి అనాథలకు అన్ని సదుపాయాలు సమకూరుతున్నాయి. కానీ, ఆ స్థలం ఇచ్చిన దాత ఇప్పుడా స్థలంలో తాను భవనం నిర్మించాలని, మీరు మరో స్థలాన్ని చూసుకోమ్మని విపరీతమైన ఒత్తిడి చేస్తున్నారు. ఇది గమనించిన కొందరు సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు సహృదయంతో ఒక స్థలాన్ని కొనుగోలుచేశారు. ఇక అందులో భవనాల (షెడ్ల) నిర్మాణం చేపట్ట వలసి వుంటుంది. పైన చెప్పిన అన్ని రకాల ప్రభుత్వ శాఖలు వీరి సేవలను వినియోగించుకుంటున్నారే కాని, వీరికి అవసరమైన ఏర్పాట్లు మాత్రం చేయటం లేదు. ఇంత వరకు ఏ స్థానిక నాయకుడు కూడా వీరికి ఏదైనా సహాయం చేయాలన్న ఆలోచన కూడా చేయటం లేదు. కనీసం సహాయం ఏదైనా ప్రభుత్వపరంగా కావాలా? అని అడిగినవారు కూడా లేరు.



స్థానికంగా వున్న జిల్లా వైద్య అధికారులు, వ్యాపార వేత్తలు ఎంతోమంది ఆర్థికంగా, నైతికంగా సహాయ సహకారాలు అందిస్తుండబట్టే ఈ ఆశ్రమాన్ని తత్సంబంధ కార్యక్రమాలని నడవ గలుగుతున్నాము అని అంటారు శ్రీనివాస్.

బి.ఎస్.ఎన్.ఎల్. సంస్థలో ఒక చిన్న ఉద్యోగిగా పని చేస్తూ తనకు వచ్చే జీతంలో అతి కొద్దిగా మాత్రమే తన అవసరాలకు వుంచుకొని, మిగతా సింహ భాగాన్ని ఆశ్రమ ఖర్చుల నిమిత్తం వాడుతూ వుంటారు. అనేకసార్లు బయట నుంచి అధిక వడ్డీకి కూడా అప్పులు చేసి, సంస్థ నిర్వహణకు ఖర్చు చేసిన సందర్భాలు వున్నాయి. బంధువులు, శ్రేయోభిలాషులు, తెలిసిన వారు కొందరు తోచిన ఆర్థిక సహాయం చేస్తున్నా, నిర్వహణా ఖర్చులు పెరగటంతో ఆశ్రమాన్ని సజావుగా నడిపించటం కష్టతరమౌతోంది.

ఇంత మహత్తర సేవా భావంతో పని చేస్తున్న "అన్నం శ్రీనివాస రావు" నిజమైన 'కారణ జన్ముడు' అనటం అతిశయోక్తి కాదేమో. ఈ కథ చదివిన సహృదయులు ఎవరైనా సరే ఆ సంస్థలో నివసిస్తున్న అనాథలు, మతి స్థిమితం లేని వారికి కప్పుకోవడానికి దుప్పట్లు, టవల్లు, కట్టుకోవడానికి బట్టలు, వారి భోజనానికి బియ్యం, పప్పు ధాన్యాలను పంపి 'మీ పరిమళించే హృదయాల' సువాసనతో ఆశ్రమానికి సుగంధ పరిమళాలు అందిస్తారని ఆశిస్తోంది 'పల్లెసృజన'. దేశ విదేశాల్లోని పెద్ద దాతలతో, సంస్థలతో సంప్రదించి, అన్నం ఫౌండేషన్‌కు సహాయాన్ని తీసుకు రావడానికి అన్నం శ్రీనివాస రావు గారి సేవలను జాతీయంగా, అంతర్జాతీయంగా గుర్తింపు రావడానికి 'పల్లెసృజన' కృషి చేస్తుంది.

**అన్నం శ్రీనివాస రావు గారి ఫోన్ నెం.: 94910 88522**

# గత మాసాల్లో పల్లెసృజన పాల్గొన్న వివిధ ప్రదర్శనలు - కార్యక్రమాలు







నవంబర్ 10న హైదరాబాద్ పరిసరాల్లోని స్మార్ట్ ఇంజనీరింగ్ కళాశాలవిద్యార్థులు, 23 మంది అధ్యాపకులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి, పురాతి స్థాయి ఇన్నోవేషన్లను పరిశీలించిన దృశ్యాలు.



డిసెంబర్ 11న దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 22 మంది మహిళా అభ్యర్థులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి ఇన్నోవేషన్లను పరిశీలించడమైనది.









డిసెంబర్ 1 నుండి 3వ తేది వరకు హైదరాబాద్ ఐ.సి.ఐ.ఎల్. పార్క్ సమీపంలో గల ఎస్.ఎస్.ఐ.సి. ప్రాంగణంలో అంతర్జాతీయ సంస్థ 'ఐ.ఐ.ఐ.ఎఫ్.' వారు నిర్వహించిన ఇన్నోవేషన్ల ప్రదర్శనలో 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను ప్రదర్శించడమైనది.
ఆ సదస్సులో 8 మంది ఇన్నోవేటర్లు పాల్గొనగా, దాదాపు 30 ఇన్నోవేషన్లను ప్రదర్శించడమైనది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న 8 మంది ఇన్నోవేటర్లను నిర్వాహకులు 'గోల్డ్ మెడల్' తో సత్కరించడమైనది. ఈ సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొని ఇన్నోవేటర్లను అభినందించారు.





వరంగల్ లో నవంబర్ 6-7 తేదీలలో 60 మంది 'టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్' విద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, 5 మంది అధ్యాపకులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని





నవంబర్ 29న ఇబ్రహీం పట్నం నుండి 21 మంది మహిళలు, 28 మంది గొండియా, మహారాష్ట్ర మహిళలు, 22 మంది కలహండి, ఒరిస్సా మహిళలు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి, పురాతి స్థాయి ఇన్నోవేషన్లను పరిశీలించినప్పటి దృశ్యాలు.



## జాతీయ అవార్డు పొందిన

# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్ములమడక శశిమోహన్

## రెండు 'నాడె'ల (డబుల్ షటిల్) మగ్గం

**సమస్య - పరిష్కారం :**

మణిపూర్‌కి చెందిన 'నగాంగం నాబాకుమార్ సింగ్' తనకు తాను ఉపాధి కల్పించుకుందామనే ఉద్దేశ్యంతో తనవద్దనున్న కొద్దిపాటి ధనంతో సింగిల్ షటిల్ లూం (ఒక నాడె గల మగ్గం) కొనుగోలు చేశాడు. ఇతనికి వడ్రంగి పనిలో కూడా కొంత అనుభవం వుంది. చెక్కతో చేసిన ఆ మగ్గంలో ఒకే 'నాడె'తో పని చేసేకన్నా, రెండు 'నాడె'లతో పని చేయిస్తే రెండింతల పని అవుతుంది కదా అని ఆలోచించాడు. తనకున్న పరిజ్ఞానంతో తెలిసినవాళ్ళ సలహాతో ఇప్పుడు 'పంతోబి లూం' అని ప్రాచుర్యం పొందిన రెండు నాడెల మగ్గంగా రూపొందించాడు.



**పరికరం :**

ఈ రెండు నాడెల మగ్గం మామూలు మగ్గం లాగే అదే సూత్రంపై పని చేస్తుంది. కాకపోతే ఒకే కుదుపుకు ఇటు నుంచి అటు, అటునుంచి ఇటు రెండు నాడెలు ఒకేసారి కదలటం వలన రెండింతల పని జరుగుతుంది. అదే సమయంలో తక్కువ శ్రమతో ఎక్కువ పని చేయటానికి ఈ పరికరం ఉపయోగ పడుతుంది.

**సాంకేతిక వివరాలు :**

❀ మౌలికంగా రెండు చీరలు ఒకేసారి నేసే పద్ధతి.

❀ నేతగాడు రెండు మగ్గాల మధ్యన కూర్చుని నాడెలను కదిలించే పనిని ఒక్కసారి కదిలిస్తే రెండు మగ్గాల నాడెలు ఒకేసారి కదిలి రెండు చీరలు సమాంతరంగా నేయబడతాయి.

❀ బేరింగుల సహాయంతో నిర్మించబడినందువల్ల పని కూడా ఎంతో సులభంగా వుంటుంది.

**ముఖ్యాంశాలు :**

❀ ఒకేసారి రెండు చీరలు నేసే అవకాశముంటుంది.

❀ సమయం ఆదా అవుతుంది.

❀ శ్రమ ఆదా అవుతుంది.

❀ జకార్డ్ పద్ధతి గల మగ్గాలపై కూడా ఒకే జకార్డ్ నుంచి రెండు చీరలు డిజైన్ చేసుకోవచ్చు.




❀ ఒక నాడెతో పనిచేసే మగ్గంలాగే వుంటుంది కాబట్టి ఎటువంటి ప్రత్యేకమైన శిక్షణ అవసరం లేదు.

**పురస్కారాలు :**

❀ 2013లో ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో జాతీయ స్థాయి బహుమతి లభించింది.


**వివరాలకు సంప్రదించండి :**

**పల్లెసృజన, సుభాష్, ఫోన్: 9652801700**

E mail: subhash4@gmail.com,
Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం


[illegible]



[illegible]



[illegible]



[illegible]

యంత్రపరికరాలు



[illegible]



[illegible]

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని
తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి
సంకేతమిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.
'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.
గూగుల్ మ్యాప్‌లో 'పల్లెసృజన'
అని వ్రాస్తే మార్గం మీకు చూపిస్తుంది

# ఒకదానినొకటి పట్టుకునే ఇటుకల తయారీ యంత్రం

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సీడ్ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : బి. శశిమోహన్

**సమస్య – పరిష్కారం :**

ఒకదానినొకటి పట్టుకొని వుండే ఇటుకలు (ఇంటర్ లాకింగ్) గృహ నిర్మాణ రంగంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించిందనే చెప్పాలి. ఈ పద్ధతి వలన ఇసుక సిమెంటు వాడకం చాలావరకు తగ్గుతుంది. చేతి అచ్చులతో తయారు చేస్తే ఈ ఇటుకల తయారీ చాలా నెమ్మదిగా జరగటమే కాక, అవసరానికి తగిన ఇటుకలు తయారు చేయలేరు. అందుకని అస్సాంకు చెందిన 'ఉమేష్ చంద్ర శర్మ' ఒకదానినొకటి పట్టుకునే ఇటుకల యంత్రాన్ని తయారు చేశాడు. దీనితో అవసరానికి కావలసిన ఇటుకలను తయారు చేసుకోవటమే కాక, అనేక మందికి ఉపాధి కూడా దొరికే అవకాశం మెరుగు పడింది.

**పరికరం :**

అచ్చులలో మిశ్రమం వేసిన తర్వాత కుదుపులకి మిశ్రమం మూల మూలలకీ, పంపులకి కూడా వెళ్ళటం వలన ఇటుకలు ఒకదానినొకటి పట్టుకోవడానికి వీలుగా తయారౌతాయి. పైగా హైడ్రాలిక్ పద్ధతిలో ఒత్తిడి తీసుకు రావటం వలన ఇటుకలు ఒకదానినొకటి పట్టుకోవడం సులభం అవుతుంది.

**సాంకేతిక వివరాలు :**

❀ యంత్రం కొలతలు 4 అడుగులు, 5 అడుగులు, రెండున్నర అడుగుల కొలతలతో వుంటుంది.

❀ బరువు సుమారుగా 600 కిలోలు వుంటుంది.

❀ 20 నిమిషాలలో 44 ఇటుకలు తయారౌతాయి.

❀ తయారైన ఇటుకలు మామూలు ఇటుకల మాదిరే 2.5 అంగుళాల ఎత్తు, 4 అంగుళాల వెడల్పు, 9 అంగుళాల పొడవు కలిగి వుంటాయి.





ముఖ్యాంశాలు :

- ❀ యంత్రంలో అచ్చులు మార్చటం ద్వారా మామూలు ఇటుకలు కూడా చేసుకోవచ్చు.
- ❀ వేరే హైడ్రాలిక్ ప్రెస్ అవసరం లేదు.
- ❀ తక్కువ శ్రమతో ఎక్కువ ఇటుకలు తయారు చేసుకోవచ్చు.
- ❀ చాలా తక్కువ కరెంటుతో పని చేస్తుంది.
- ❀ ఉపాధి అవకాశాలను పెంచుతుంది.

పురస్కారాలు :

- ❀ 2015లో ఎన్ఐఎఫ్ వారి 8వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది.

**వివరాలకు సంప్రదించండి:**

**పల్లెసృజన, సుభాష్, ఫోన్: 9652801700**
E mail: subhash4@gmail.com,
Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

అద్భుతానికి పర్యాయంగా పల్లె 'గ్రామీణుల ఇన్నోవేషన్స్'

## రైతుల కోసం రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్లు

# నిమటోడ్స్ నివారణకు వనమూలికలతో పురుగు మందు

కేవలం భారత దేశాన్నే కాదు ప్రపంచ రైతాంగాన్ని పటిపీడిస్తున్న సమస్య 'నిమటోడ్స్'. ఈ వ్యాధి వల్ల

'పల్లెసృజన' ఇన్నోవేటర్ "గల్లా చంద్రశేఖర్" మూలికలతో తయారు చేసిన "నిమటోడ్స్" పురుగు మందు అద్భుతంగా పని చేస్తుందని నిరూపించబడింది.

ఈ మందు సంవత్సరానికి ఒక్కసారి ఉపయోగిస్తే మీ పంటను పీడించే 'నిమటోడ్స్' నుంచి సంపూర్ణ రక్షణ లభిస్తుంది. ఇప్పటికే వేలాది మంది రైతులచే నిరూపితమైంది. ఈ మందు తయారైన రెండు సంవత్సరాల వరకు పని చేస్తుంది.

ఈ మూలికా పురుగు మందు 'నిమటోడ్స్' పురుగులను చంపివేయటంతో పాటు, ఈ మందు ఉపయోగించటానికి వారం రోజుల ముందు చనిపోయిన మొక్కను కూడా చిగురింపజేసింది అనటానికి ఎన్నో సాక్ష్యాలు మావద్ద వున్నాయి.

జామ, దీని, నిమ్మ, మల్లె, మిరప, వేరుశనగ రైతులు సంవత్సరానికి ఒక్కసారి ఈ మందును మీ పంటకు అందిస్తే చాలు, ఈ పురుగు బారినుండి సునాయాసంగా విముక్తి పొందవచ్చు.

'రాష్ట్రపతి పురస్కార గ్రహీత' చంద్రశేఖర్ గారి 'నిమటోడ్స్ నివారణ' మందును ఉపయోగించుకుని రైతులు బత్తాయి, జామ, మిరప, వేరుశనగ, కూరగాయలు, పూలు, మొక్కజొన్న వగైరా పంటలను కాపాడుకుంటారని ఆశిస్తోంది 'పల్లెసృజన'.

**ఈ మందు కావలసిన వారు సంప్రదించండి :**

ఫోన్ నెం. : వీరరాఘవ రెడ్డి, 8125799904, సుభాష్ చందర్, 9652801700




నిమటోడ్స్ మందు వాడటం వల్ల చనిపోయిన చెట్టు వేర్లకు ప్రక్కన కొత్త వేర్లు ఇలా వచ్చాయి.

# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




- 'ఎన్.ఐ.ఎఫ్.' సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## ఎక్కడికైనా తీసుకువెళ్ళ గలిగే చెక్క మగ్గం

జాతీయ స్థాయి ప్రోత్సాహక పురస్కారం - చేనేత రంగం
ఇన్నోవేటర్ : అనూప్‌రాం, గులాబ్‌దాస్, కులు, హిమాచల్ ప్రదేశ్




43 సంవత్సరాల అనూప్ రాం మరియు 59 సంవత్సరాల గులాబ్ దాస్ లు ఇద్దరు వృత్తిరీత్యా వడ్రంగి పని చేసేవారు. ఇద్దరూ కలిసి తమ అనుభవాన్ని ఉపయోగించి, తేలికగా ఎక్కడికైనా తీసుకెళ్ళ గలిగే మగ్గాన్ని రూపొందించారు. కులూ ప్రాంతంలో తయారు చేసే అనేక రకాల బట్టలు, శాలువలని ఈ మగ్గంమీద నేసుకోవచ్చు.

అనూప్‌రాం తన భార్య, ముగ్గురు ఆడ పిల్లలతో వడ్రంగి పని చేస్తూనే వ్యవసాయం కూడా చేసుకుంటూ వుంటాడు. విచిత్రమేమిటంటే వృత్తిరీత్యా వడ్రంగి కాకపోయినా, తన చుట్టూ వున్నవారిని గమనించి, వడ్రంగి పనిమీద ఆసక్తి పెంచుకొని నేర్చుకున్న వ్యక్తి. గులాబ్‌దాస్ వృత్తిరీత్యా వడ్రంగి అయి, తన భార్య, ఇద్దరు కొడుకులతో పాటు అన్నదమ్ములతో కూడిన ఉమ్మడి కుటుంబం.

చలి ప్రదేశమైన కులు లో రకరకాల టోపీలు ధరించడం ఆచారం. ఈ టోపీలు చాలా ప్రదేశం ఆక్రమించుకునే పెద్ద మగ్గంపైన తయారు చేస్తూ వుండేవారు. ఈ మగ్గాలలో 45 నిమిషాలలో 5 వరుసలలో టోపీలకు బట్ట నేయవచ్చు. కాకపోతే చాలా నిపుణులైన నేతగాళ్ళు మాత్రమే ఈ పని చేయగలరు. నేత పని అందరికీ అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో అనూప్‌రాం 18 సంవత్సరాల క్రితం ఎక్కడికైనా తీసుకు వెళ్ళగలిగే చిన్న మగ్గాన్ని తయారు చేశాడు. దీనిపై 30 నిమిషాలలో రెండు వరుసలలో టోపీకి అవసరమైన





గుడ్డను నేయవచ్చు. ఈ చిన్న మగ్గంపై కొద్దిపాటి పరిజ్ఞానం ఉంటే చాలు, ఎవరైనా సరే, ఎక్కడైనా చాలా సులభంగా టోపీకి కావలసిన బట్టలు నేయవచ్చు. ఆ కారణం వల్లనే ఇతనికి కులు ప్రాంతంలో 30 మగ్గాల వరకు అమ్మారు.

వృత్తి రీత్యా వడ్రంగి పనిచేసే *గులాబ్ దాస్* పెద్ద శాలువలు, దుప్పట్లు తయారు చేయటానికి పెద్ద మగ్గాలు తయారు చేసేవారు. మగ్గాలు తయారు చేసే వృత్తిలోనే వుండటం వలన సులభంగా నేత పనిపై మక్కువ పెంచుకున్నారు. తానూ నేస్తూ వుండటంతో మంచి నాణ్యమైన మగ్గాలు తయారు చేయటం ప్రారంభించారు. క్రమంగా పెద్ద మగ్గాలు కాకుండా, అందరికీ అందుబాటు వుండేలా చిన్న మగ్గాలు ఎందుకు తయారు చేయకూడదు అని ఆలోచించి, స్త్రీలు, ముసలివారు కూడా ఉపయోగించటానికి వీలుగా చిన్న మగ్గాన్ని రూపొందించారు. చెక్కతో చేయబడ్డ ఈ చిన్న మగ్గంలో ఉన్ని టోపీలకు బార్డర్లు, శాలువలకి బార్డర్లు కూడా సులభంగా నేసుకోవచ్చు. ఇటువంటి యంత్రాలను ఇతను 400కు పైగా విక్రయించారు.

వీరిద్దరూ కలిసి సులభంగా ఎక్కడికైనా తీసుకు వెళ్ళ గలిగే చిన్న చెక్క మగ్గాన్ని రూపొందించారు. దీనిలో లాకింగ్ పద్ధతి ఉండటం వలన ఉన్ని బట్టలు నేసేటప్పుడు చిక్కగా, బిగుతుగా నేసే అవకాశం వచ్చింది. చిన్నగా ఉండటం వలన దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకు వెళ్ళడానికి వీలవుతుంది. బయట పెట్టుకొని పని చేసి, పూర్తైపోగానే ఇంట్లోకి తీసుకువచ్చి దాచుకోవచ్చు. ఈ యంత్రంపై టోపీలు, శాలువలు, బార్డర్లు చాలా సులభంగా నేసుకోవచ్చు. మన్నికగా పనిచేసే ఈ మగ్గాన్ని వీరిద్దరూ సుమారు 18 సంవత్సరాల నుంచి తయారు చేస్తున్నారు.

ఈ చిన్న మగ్గంపై ఏమాత్రం ప్రత్యేక శిక్షణ లేని వ్యక్తి కూడా కొద్దిపాటి నేర్పరితనంతో సులభంగా ఎక్కడైనా కూర్చొని బట్టలు నేయవచ్చు. ఒక పెద్ద మగ్గంలో నేసే అన్ని రకాల బట్టలని ఈ చిన్న మగ్గంపైన కూడా నేయవచ్చు. ●

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 12 వ ద్వైవార్షిక పోటీలు

పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృత్తుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కానీ, సామూహికంగా కానీ పంపవచ్చు. మహిళలు, మారుమూల ప్రాంతాల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించుటకు, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి బహుమతిగా **రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000**లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా పెట్టుకున్న వారికి ఇవ్వబడును. అంతే కాకు ప్రోత్సాహక బహుమతి క్రింద రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెలికి వెలికి తీయుటానికి తోడ్పడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. ఇదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయుటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2021** లోగా మాకు చేరేలా పంపండి.

మీ దరఖాస్తులను పంపవలసిన చిరునామా :

**National Innovation Foundation,**
C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.
Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

గమనిక : [illegible] http://www.nif.org.in/announcement [illegible] 040-27113858 [illegible]




# గొర్రె అశోక్‌కు
## జాతీయ స్థాయి గుర్తింపు

- పల్లె వీరరాఘవ రెడ్డి

నవంబర్ 2019లో కలకత్తాలో జరిగిన 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఫెయిర్' (ఐఐఎస్ఎఫ్) వారు నిర్వహించిన ప్రదర్శనలో మన ఇన్నోవేటర్ 'గొర్రె అశోక్' కు పాల్గొనే అవకాశం లభించింది. ఈ ప్రదర్శనలో వ్యవసాయ పరికరాల ఇన్నోవేషన్ల విభాగంలో అతి చిన్న వయస్కుడైన (ఇంటర్మీడియట్ చదువుతున్నాడు) అశోక్‌కు మొదటి స్థానం లభించింది. అంతే కాక, ఈ ప్రదర్శనలో పాల్గొన్న ఉత్తమ ఇన్నోవేషన్లలో నాలుగింటిని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. అశోక్ ఇన్నోవేషన్ అందులో ఒకటి.

ఈ పరికరం సహాయంతో వరిమళ్లలో ప్రధాన విత్తనంలో అప్పుడప్పుడూ కలిసి పోయిన ఇతర విత్తనాలు (బెరుకులు), కలుపు తీసేందుకు సాధారణంగా వ్యక్తి వంగుని ఆ మొక్కలను చేతితో పీకి వేయాల్సి వుంటుంది. దానివల్ల బాగా ఎత్తుగా పెరిగిన వరిమడిలో వంగుని చేయటం కొద్దిగా కష్టంతో కూడుకున్న పని. పైగా వరిమళ్ళు ఎప్పుడూ నీటితో నిండి వుంటాయి కాబట్టి కొద్దిగా అసౌకర్యంగానే వుంటుంది. ఈ సమస్యలన్నిటికి పరిష్కారంగా నిలబడి కలుపు మొక్కలు, బెరుకు మొక్కలను చేతితో ఈ పరికరం ద్వారా నిలబడే సులభంగా, ఎటువంటి శ్రమ లేకుండా తీసివేయవచ్చు. పైగా ఎంతో కూలీ ఖర్చు కూడా మిగులుతుంది రైతుకు.

ఐఐటి ఖరగ్‌పూర్ ప్రొఫెసర్లు ఇతర సైంటిస్టులు తన ఇన్నోవేషన్‌ను ఎన్నుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు అశోక్. ఈ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులంతా ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారే కావటం, అందులో నేను మాత్రమే ఇంటర్ విద్యార్థిని కావడం నాకెంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు అశోక్. మిగతా విద్యార్థులంతా సాఫ్ట్‌వేర్ సంబంధించిన ఇన్నోవేషన్లు లేదా సెన్సార్లకు సంబంధించిన ఇన్నోవేషన్‌లను తయారు చేశారని తాను మాత్రం రైతులకు సంబంధించిన పరికరం తయారు





చేయటంతో ఆ కార్యక్రమంలో పాల్గొన్న అందరు తనను ఎంతగానో అభినందించారన్నారు అశోక్.


ఈ ఇన్నోవేషన్ ప్రదర్శనలో జాతీయ స్థాయిలో మొదటి బహుమతి ఇవ్వటంతో పాటు, రూ. 11,000/-ల ఆర్థిక పురస్కారం కూడా లభించింది.

'పల్లెసృజన' ప్రోత్సాహంతో ఈ ప్రదర్శనలో పాల్గొనే అవకాశం రావటం తనకెంతో ఆనందాన్ని ఇచ్చిందని, జాతీయ స్థాయిలో నాకు ఇంతటి గుర్తింపు తీసుకు వచ్చిన పల్లెసృజనకు ధన్యవాదాలు తెలియజేశారు అశోక్. ఈ ప్రదర్శనలో పాల్గొన్న ఆనందం ఒకవైతే, అంతకన్నా ఆనందించే విషయం ఏమిటంటే, నేను త్వరలో ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నా ఇన్నోవేషన్‌ను ప్రదర్శించ బోతున్నాను అన్న ఆనందం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోందన్నారతను.

ఈ ప్రదర్శన, జాతీయ బహుమతి వచ్చిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి కెటిఆర్ పిలుపు మేరకు పల్లెసృజన స్వచ్ఛంద సేవకురాలు అఖిలతో పాటు అశోక్ వెళ్ళి మంత్రిగారిని కలవడం జరిగింది. అప్పుడు మంత్రి కెటిఆర్ అశోక్‌ను అభినందిస్తూ, "రైతులకు ఎంతో అవసరమైన చిన్న పరికరాన్ని కనుగొని, రైతుల శ్రమను తగ్గించడం చాలా బాగుందని, జాతీయ స్థాయి బహుమతితో పాటు, ఢిల్లీ లోని రాష్ట్రపతి భవన్‌లో నీ ఇన్నోవేషన్ ప్రదర్శనకు అనుమతి లభించడం మన రాష్ట్రానికి గర్వకారణమని, నీకు ఏ అవసరం వచ్చినా, లేదా ఇంకా ఏదైనా ఇన్నోవేషన్ చేయాలనుకున్నా 'తెలంగాణ ఇన్నోవేషన్ సెల్' నీకు తోడుగా ఉంటుందని" ప్రోత్సహించారని తెలియజేశారు అశోక్.

పల్లెసృజన కుటుంబంలోని గ్రాస్‌రూట్ ఇన్నోవేటర్లలో అత్యంత చిన్న వయస్కుడైన గొర్రె అశోక్‌కు జాతీయ స్థాయి గుర్తింపు రావటం వల్ల నూతన ఇన్నోవేటర్లకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించినట్లయింది. అశోక్ ముందు ముందు ఇంకా ఎన్నో ఇన్నోవేషన్లను తయారు చేయాలని, తగిన సహకారం అందించటానికి ఎప్పుడూ వెనుకాడదని పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు అశోక్‌కు అభినందనలు తెలియజేశారు. ●

**అశోక్ ఫోన్ నెం : 63052 45698**





# అంతర్జాతీయ అవార్డుపొందిన ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేటర్

# నన్నేం తిరుపతి రావు



కేబుల్ ఆపరేటర్లు, విద్యుత్ కార్మికులు కరెంటు స్తంభాలను ఎక్కి పని చేయటం, వారిలో ఒక మిత్రుడు పైనుండి క్రిందపడి చనిపోవడంతో కలత చెందిన ఒక సామాన్యుడు ప్రకాశం జిల్లా 'చీరాల'కు చెందిన "నన్నేం తిరుపతి రావు" గారు కనుగొన్న పరిష్కారం ఇప్పుడు ప్రపంచ ఖ్యాతి గడించేలా చేసింది. ఇది నన్నేం తిరుపతి రావుతో పాటు, 'పల్లెసృజన' కుటుంబానికి కూడా ఎంతో గర్వించదగిన విషయం.

తిరుపతి ఇన్నోవేషన్ 'కరెంటు స్తంభాలను ఎక్కే చెప్పులు' పరికరాన్ని 'పల్లెసృజన' కేంద్ర సంస్థ అయిన 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (ఎన్.ఐ.ఎఫ్.)కు అంతర్జాతీయ వేదికలకు పంపవలసిందిగా సిఫారసు చేసింది. ఈ పరంపరలో ఎన్.ఐ.ఎఫ్. వారు ఈ ఇన్నోవేషన్ బావుందని ఇన్నోవేటర్‌ను సంప్రదించి 'ఫిలిప్పైన్స్' దేశంలో జరిగే "ఏషియన్ - ఇండియా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్ ఫోరం" లో పాల్గొనటానికి సిద్ధంగా వుండమని చెప్పడంతో అందుకు అవసరమైన పాస్‌పోర్టు సిద్ధం చేసుకున్నారు తిరుపతి రావు.

ఇక్కడి ఢిల్లీకి పిలిపించి, అక్కడినుండి 12 మంది భారతదేశంలోని పునాదిస్థాయి ఇన్నోవేటర్లు, నలుగురు ఎన్.ఐ.ఎఫ్. ప్రతినిధుల బృందం హాంకాంగ్ మీదుగా ఫిలిప్పైన్స్ చేరుకుని నవంబర్ 20వ సదస్సులో పాల్గొనడం జరిగింది. 21వ తేదీన ఇన్నోవేటర్లందరు వేదికపైనుండి 'పవర్ పాయింట్ ప్రజెంటేషన్' ఇవ్వటం జరిగింది. ఆ ప్రజెంటేషన్‌లో ఒక్కో ఇన్నోవేటర్ 10 నిమిషాల్లో తమ ఇన్నోవేషన్ గురించి చెప్పవలసిందిగా కోరారు. ఆ క్రమంలో తిరుపతికి 26వ వాడిగా అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని తిరుపతి రావు చక్కగా వినియోగించుకున్నారు.

తనకన్నా ముందు చెప్పిన 25 మంది ఇన్నోవేటర్లు వారి ఇన్నోవేషన్‌ను గురించి ఎలా వివరిస్తున్నారో చూశారు. చాలామంది ఇన్నోవేటర్లు తమకు కేటాయించిన 10 నిమిషాల సమయానికి బదులు కేవలం 5 నిమిషాల్లోనే ముగించడం గమనించారు. అందరూ ముందుగా తమ పవర్‌పాయింట్ లో వీడియో చూపించి, తర్వాత దాని గురించి విశ్లేషించడం జరిగింది. అది అంత ప్రభావవంతంగా లేదని గమనించారు తిరుపతిరావు. తాను భిన్నంగా చేయాలని అనుకుని తన






ప్రసంగాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో పాటు కొనసాగిస్తూ అందరికీ వివరించ సాగారు. అంతేకాక, ఫిలిప్పైన్స్ దేశంలో ఎక్కువగా కరెంటు స్తంభాలు గుండ్రంగా వుండటం గమనించిన తిరుపతి తన పిపిటిలో తాను తయారు చేసిన గుండ్రటి స్తంభాలు, చెట్లను ఎక్కే పరికరాన్ని కూడా చేర్చుకున్నారు. తనకు ఇంగ్లీషు మాట్లాడటం అంతగా రాదు (కేవలం 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు) కాబట్టి ప్రజెంటేషన్‌తో పాటు ప్రసంగం వుంటే తన లోటు భర్తీ అవుతుందని ఇతను చేసిన ఉపాయం విజయం సాధించింది. అంతవరకు మొక్కుబడిగా ఇన్నోవేటర్ల ప్రసంగాలు వింటున్న ప్రేక్షకులు తిరుపతి ప్రజెంటేషన్‌ను ఎంతో ఆసక్తితో, ఉత్సుకతతో చూశారు. ఐదు నిమిషాలు ఎక్కువ సమయం కూడా కేటాయించారు నిర్వాహకులు. ప్రజెంటేషన్ పూర్తయిన వెంటనే కరతాళ ధ్వనులతో తిరుపతి రావును అందరూ అభినందించారు.

ఇక మరునాడు బహుమతి ప్రదానోత్సవం ముందుగా మూడవ బహుమతి 'రమీందర్ చోప్రా, ముంబయి, ఇండియా' అనే అతనికి ప్రకటించారు. ఇతను ఒక ముద్రణా యంత్రాన్ని తయారు చేశారు. ఆ ప్రకటన వెలువడగానే మనదేశం వారు కొంత వరకు సంతోషంగానే వున్నా, ఇక మొదటి రెండు బహుమతులు మన దేశానికి రావులే అన్న నిశ్చయానికి వచ్చేశారు. రెండవ బహుమతి 'థాయిలాండ్' దేశపు ఇన్నోవేటర్‌కు వచ్చింది. ఇతను పామోలిన్ తోటల్లో క్రిందపడ్డ పామోలిన్ కాయలను సేకరించేందుకు ఒక రోలర్ తయారు చేశారు. ఇక మొదటి బహుమతి 'ఇండియా' దేశానికి చెందిన 'పోల్ క్లైంబర్ తయారు చేసిన నక్కం తిరుపతి రావు' అని ప్రకటించడంతో అక్కడ వున్న భారత దేశపు అతిథులంతా ఎంతో ఉత్సాహంగా తమ హర్షధ్వానాలు తెలియజేశారు. ఇక తిరుపతి రావుకు నోట మాట రాలేదు. ఆనందాశ్రువులతో కార్చిపేస్తు మనసు మూగబోయి, కళ్ళు చెమర్చాయి.

వెంటనే వేదికపైకి చేరుకుని పురస్కారాన్ని, దానితో పాటు 1,500 డాలర్ల పారితోషికాన్ని కూడా అందజేశారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్.ఆర్.టి.సి. సి.ఇ.ఓ. పురుషోత్తం గారు, ఇతర భారత దేశపు అధికారులు, ఇన్నోవేటర్లు, అభిమానులు తిరుపతిని చుట్టుముట్టి అభినందనలతో ముంచెత్తారు.

ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే తనకు ఇంతటి స్థాయి కల్పించిన 'పల్లెసృజన'తో ఈ ఆనందాన్ని పంచుకోవాలి అని బ్రిగేడియర్ గణేశం గారికి తెలియజేయగా, ఆయన నువ్వు దగ్గర లేవు గాని, నిన్ను వెంటనే హృదయానికి హత్తుకోవాలని వుందయ్యా, గొప్ప విజయాన్ని సాధించావు. మా దీవెనలు ఎల్లప్పుడూ నీతోనే వుంటాయిలే అని అభినందించారు.

ఆ తర్వాత 'పల్లెసృజన' కుటుంబ సభ్యులకు మెసేజ్ పెట్టగానే వీరరాఘవ రెడ్డి 'కంగ్రాచ్యులేషన్స్ యు డిజర్వ్ ఇట్' అని అభినందించగా, మిగతా సభ్యులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

'నన్ను ఇంతటి స్థాయికి తీసుకు వచ్చిన 'పల్లెసృజన'ను నా జీవితంలో మరిచిపోలేను అంటూ తన కృతజ్ఞతలను తెలియజేశారు నక్కం తిరుపతి. తెలుగువారి క్రియాశీలతను ప్రపంచానికి చాటి చెప్పిన తిరుపతి రావుకు 'పల్లెసృజన' శుభాభినందనలు. ●

**తిరుపతిరావు మొబైల్ నంబర్ : 91336 11364**



డా. ఎపిజె అబ్దుల్ కలాం

# ఇగ్నైట్ పోటీలు 2020

> " నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది
> సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది
> ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి
> జ్ఞానం మిమ్మల్ని గొప్పవాళ్ళను చేస్తుంది "

**'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా'** పాఠశాల విద్యార్థుల కొరకు వారి స్వంత సాంకేతిక ఆలోచనలు మరియు సృజనల జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నది.

**'డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు-2020'** కి దరఖాస్తులు పంపుటకు **చివరి తేది 31 ఆగస్టు, 2020.** ఎన్ఐఎఫ్ పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఏపిజె అబ్దుల్ కలాం గారి జయంతి రోజు (అక్టోబర్ 15)న విజేతల పేర్లు ప్రకటిస్తుంది.

అర్థవంతమైనవి అని భావించిన ఇన్నోవేటివ్ ఐడియాలు/ప్రోటోటైప్‌లను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గుర్తించి, వాటి అభివృద్ధికి, పేటెంట్‌కు సహాకరిస్తుంది. 12వ తరగతి (10+ ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు (పాఠశాలేతర విద్యార్థులు, 17 సంవత్సరాల లోపు పిల్లలు కూడా) తమ ఎంట్రీలను తమ చిరునామా, పిన్ కోడ్, సెల్ ఫోన్‌తో సహా ఒక కాగితంపై వివరంగా వ్రాసి పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాలకు, లేదా ఈ-మెయిల్ ignite@nifindia.org ద్వారా పంపవచ్చు, ఆన్‌లైన్‌లో ద్వారా కూడా పంపవచ్చు.

పూర్తి వివరాలకు సంప్రదించండి :
**www.nif.org.in/ignite**

National Innovation Foundation-India
Grambharati, Amarapur, Gandhinagar- Mahudi Road,
Gandhinagar - 382650, Gujarat, India.
Tel : 02764 261131/ 32/ 38/ 39, Fax : 011 43851803
E-mail : ignite@nifindia.org, web : www.nif.org.in/ignite

# ఆయుర్వేద జ్ఞాన మథనం

## మొక్కజొన్న 'ఔషధ గని' - పండ్లు 'పరమ ఔషధాలు'

**మొక్కజొన్న :**

మొక్కజొన్న పేరు తెలియనివారు వుండరు. వీటిని కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న పొత్తులని, మొక్కజొన్న కండెలని, మక్కలు అని అంటుంటారు. మొక్కజొన్న కంకిని నిశితంగా పరిశీలిస్తే తెలుస్తుంది 'ఇది ఒక కళాఖండము' అని. భగవంతుడి సృష్టి అద్భుతమని కూడా అనిపిస్తుంది. చూడముచ్చటైన వాటిపైనున్న రెక్కల అమరిక, అద్భుతం అనిపించే గింజల అమరిక, వాటి రంగు..... ఇలా ఎన్నో వున్నాయి వీటి సృష్టిలో. మనమంతా మొక్కజొన్న కంకులను కాలక్షేపం కోసం తినటం అనుకుంటూ వుంటాము. కానీ, వీటిలో కూడా ఎన్నో ఔషధ గుణాలున్నాయి.

వీటిలో ఎంతో శక్తివంతమైన, బలవర్ధకమైన పదార్థాలున్నాయి. కార్బో హైడ్రేట్లు, విటమిన్లు, పీచు పదార్థం లాంటివెన్నో వున్నాయి. వీటిలో కొవ్వు శాతం చాలా తక్కువ. వీటిని తింటే గుండెకు ఎంతో మంచిది. శరీరంలో ఐరను తక్కువగా వున్న వారికి ఇది దివ్య ఔషధంగా పని చేస్తుంది.

మొక్కజొన్న గింజలను ఉడికించి తింటే క్యాన్సర్ కారకాలకు దూరంగా వుండవచ్చు. శరీరానికి కంచు కవచంలా పని చేస్తుందిది. కండరాలు బిగుసుకుపోయే వారికి కూడా ఇది దివ్య ఔషధం.

మొక్కజొన్న కండె పైనున్న రెక్కలను జాగ్రత్తగా తీసివేస్తే ఆ రెక్కలకు, కండెకు మధ్యన సన్నటి దారాల్లాంటివి ఉంటాయి. చిన్నప్పుడు వాటిని పిల్లలు పై పెదవిపైన పెట్టుకుని 'మీసాలు' అనేవారు. ఆ పీచును సేకరించి, నీటిలో బాగా ఉడకబెట్టి, చల్లారిన తర్వాత వడకట్టుకుని త్రాగినట్లయితే



మూత్రపిండాల్లో రాళ్ళు కరిగిపోతాయి. ఈ ద్రావణాన్ని ఒక పది రోజులపాటు తీసుకున్నట్లయితే చాలా బాగా పని చేస్తుంది. ఇలా చేయటం వల్ల చర్మ వ్యాధులు కూడా తగ్గుతాయి.

విటమిన్ 'ఎ' వీటిలో ఎక్కువగా వుండటం వలన క్యాన్సర్‌ను దరిచేరనివ్వదు. కొంతమందికి కొన్ని రకాల అలర్జీలు వస్తూ వుంటాయి. అటువంటి వారు మొక్కజొన్నలు ఉడకబెట్టిన గంజిని అలర్జీ వున్నచోట రాస్తే అలర్జీ పోతుంది.

చిన్నపిల్లలు, యువకులు, వృద్ధులు, ఆడ, మగ అన్న తేడా లేకుండా అందరూ ఈ గంజిని తాగవచ్చు. చాలా త్వరగా అరిగిపోయి, శరీరానికి మంచిని చేసే గుణం ఇందులో దాగుంది. కాబట్టి మొక్కజొన్న కండెలు తినటం కాలక్షేపం అనుకోకుండా, ఆరోగ్యం అనుకుని తింటే చాలా మంచిది.

మొక్కజొన్న కంకులు తిన్న తర్వాత వాటి కంకిని పారవేస్తూ వుండటం సర్వ సాధారణం. కానీ అలా పారవేయకుండా, వాటిని అలాగే వుంచి ఎండిన తర్వాత కాల్చి బూడిద చేసి, ఆ బూడిదను కొబ్బరినూనెలో కలుపుకుని, శరీరానికి పూసుకుని, ఒక గంట తర్వాత స్నానం చేసినట్లయితే చర్మానికి ఎంతో మంచిది, సోరియాసిస్ జబ్బు వున్నవాళ్ళకు కూడా ఇది ఉపశమనం కలిగిస్తుంది.

**పండ్లల్లో ఔషధ గుణాలు:**

**అనాస (పైనాపిల్) :** గనేరియా, కిడ్నీ, గుండె జబ్బులు, మలబద్ధకం, అజీర్ణం వ్యాధులను తగ్గిస్తుంది.

**అంజీర్ :** మంచి దేహ పుష్టి కలుగుతుంది, వీటిని పాలల్లో కలుపుకుని తీసుకున్నట్లయితే విటమిన్ లోపాలను సరిచేస్తుంది.

**ద్రాక్ష :** రక్తశుద్ధి, మలబద్ధకాలను పోగొడుతుంది.

**ఆపిల్ :** రక్త వృద్ధి కలిగించి, దీర్ఘకాల రోగాల నుండి ఉపశమనం పొందేలా చేస్తుంది. అందుకే చాలామంది రోగులకు ఆపిల్ పండ్లనే ఎక్కువగా అందిస్తూ వుంటారు.

**బొప్పాయి :** కళ్ళకు మంచిది, వీటిని ఉదయం పూట తింటే మంచిది, గర్భిణీ స్త్రీలు వీటిని తినకూడదు. మలబద్ధకానికి కూడా ఈ పండు మంచి ఔషధం.

**దానిమ్మ :** ఈ పండు అనేక రోగాల నుండి ఉపశమనం

కలిగిస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది.

**ఈత** : ఇది క్షయ రోగులకు మంచి బలవర్ధకమైన ఆహారం.

**జామ** : అజీర్ణాన్ని, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఎక్కిళ్ళు వున్నవారు జామకాయ తింటే ఎక్కిళ్లు తగ్గిపోతాయి.

**సీతాఫలం** : రక్తవృద్ధి జరుగుతుంది, పొట్టలో వున్న క్రిములను తొలగిస్తుంది. వీటిని ఎక్కువగా తింటే బరువు పెరిగే ఆస్కారం వుంటుంది. కాబట్టి రోజుకు ఒకటి లేదా రెండు పండ్లకన్నా ఎక్కువ తీసుకోవటం మంచిది కాదు.

**పనస** : పనస పండు తిన్నవారికి 'హైపర్ టెన్షన్' తగ్గుతుంది. అర్శమొలలు కూడా తగ్గుతాయి. క్షయ వ్యాధి వారికి కూడా చాలా మంచిది. స్త్రీ వ్యాధి నివారణకు దివ్య ఔషధంగా పని చేస్తుంది. కానీ ఎక్కువగా తినకూడదు. రోజుకు 5 లేదా 6 పనస విత్తనాలను తింటే మంచిది. ఎక్కువగా తింటే వాతం వచ్చే అవకాశముంది.

**పుచ్చకాయ** : దీన్ని తినటం వల్ల దాహం సమస్య వుండదు, మూత్రం సులభంగా క్రిందకు జారేలా చేస్తుంది.

**అరటి** : పోషక విలువల ఖజానా అని చెప్పవచ్చు. ఇందులో క్యాలరీలు ఎక్కువగా వుంటాయి.

**ఖర్జూర** : శరీరానికి చలువ చేస్తుంది, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీన్ని భోజనం చేసిన రెండు గంటల తర్వాత తింటే బాగా పని చేస్తుంది. వెంటనే తినకూడదు, ఎందుకంటే ఇది తేలిగ్గా అరగదు.

**రేగు** : అర్శ మొలలను తగ్గిస్తుంది వీటిని భోజనానికి ముందు తింటే మంచిది. భోజనం తర్వాత తినటం అంత మంచిది కాదు.

**మామిడి** : కళ్ళకు ఎంతో మంచిది, బలవర్ధకమైన పండు. పళ్ళల్లో రాజసం ఉట్టిపడే పండు ఇది. అందుకే దీన్ని పండ్లల్లో రారాజు అని కూడా కొందరు అంటారు.





**నేరేడు** : విరేచనాలు సాఫీగా జరిగేలా చేస్తుంది. మధుమేహ వ్యాధిని అదుపులో వుంచుతుంది.

**బత్తాయి** : అన్ని బాధల వారికి ఇది మంచి ఔషధ గుణాలున్న పండు, జ్వరం, రక్త హీనతలను తగ్గిస్తుంది. అందుకే ఆసుపత్రుల్లో రోగులకు ఆపిల్ కొనలేని వారు బత్తాయి పండ్లను ఇస్తూ వుంటారు.

**పీచ్** : రక్తపోటు రానివ్వదు. రక్తపోటు వున్నవారు వీటిని బాగా తినవచ్చు.

**సపోట** : మంచి బలవర్ధకమైన పండు. శరీరానికి ఎంతో బలాన్ని చేకూరుస్తుంది.

**అంజీర** : ఇది ఎముకల వ్యాధి వున్నవారికి చాలా మంచిది. నల్లటి పండ్లను తీసుకుని, తేనెలో నానబెట్టి రోజూ ఒకటి చొప్పున తింటూ వున్నట్లయితే మోకాళ్ళ నొప్పులు వున్న వారు కూడా ఎటువంటి శస్త్రచికిత్స అవసరం లేకుండా మోకాళ్ళ నొప్పులు నయమవుతాయి.

**వెలగ పండు** : మలబద్ధకం (అమీబియాసిస్) ను దూరం చేస్తుంది.

**మారేడు పండు** : మంచి ఆకలిని కలుగజేస్తుంది. జ్ఞాపక శక్తిని పెంచుతుంది.

మొత్తానికి ఏ పండు అయినా సరే అందులో ఎంతో కొంత ఔషధ గుణం కలిగే వుంటుంది. కాబట్టి ఏ కాలంలో వచ్చే పండ్లను ఆ కాలంలో తింటూ వుంటే ఒంటికి మంచిది.

**గమనిక** : ఈ శీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు నిష్ణాతులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854**

'పల్లెస్పందన' చేపట్టిన "దివ్య తీర్థయాత్ర" లో పాల్గొన్న ఒక యాత్రికుని కలం నుండి జాలువారిన పదాలు....

## ఓ పల్లె జనమా - నీ కోసమే ఈ 'పల్లెస్పందన'

ఉదయాన్నే పలకరించెను సూర్యుని కిరణం, పచ్చదనంతో నిండినది ఈ పల్లె అందం.
కొండల నడుమన సాగే నీ ప్రయాణం, పక్షుల గానాలు కలిగించెను స్వేచ్ఛా భావం.
వాగులు, సెలయేళ్ళు అందించెను సంగీత నాదం. అతిథ్యాలను సైతం సహాయం చేయగల మనుష్యుల జనం ఈ స్థలం.
అదే అదే ఈ పల్లె చారిత్రకం.
ఓ పల్లె జనమా! అందుకే నీకోసం వచ్చింది ఈ 'పల్లెస్పందన'.

## ఓ నేస్తమా - ఓ యాత్రి

ఓ నేస్తం :

ఓ యాత్రీ! ఓ యాత్రీ!
పూర్తయిందా నీ పల్లెస్పందన యాత్రా ప్రయాణం
దీనివల్ల నీకేమైన కల్గిందా ప్రయోజనం
లేక అది ఎందుకా అని కల్గిందా సందేహం.

ఓ యాత్రీ :

ఓ నేస్తమా నా నేస్తమా
పూర్తయ్యింది నా పల్లెస్పందన యాత్రా ప్రయాణం
అది జ్ఞానాన్ని వెతికే మనుష్యులతో సంబంధం
మా తొలి మాటలోనే మొదలాయెను మైత్రి బంధం
వాటిని తెలుసుకునేందుకు సాగెను మా సంభాషణలు
సమస్యలను ఛేదించిన వ్యక్తులతో పరిచయాలు
వారినుండి నేర్చిన అనుభవాలు అవి మా భావి జీవితానికి మంచి మలుపులు
ఇలాంటి అద్భుతమైన స్మృతులతో నిండిన ఈ యాత్రా సమయం...
ఓ నేస్తమా! నా నేస్తమా!
ఇదే నా పల్లెస్పందన ప్రయాణం
దీనివల్ల నేను ఎంతో పొందాను ప్రయోజనం
నీకు చెప్పడానికి నాలో లేదు ఏ సందేహం.
ఓ నేస్తమా!
మరి నాకు దొరికెను ఇలాంటి అవకాశం
మంచి మనుషులతో, మంచి మనసుల సహవాసం
జ్ఞానాన్ని శోధించేందుకు వెతుకుతున్నాను ఒక మార్గం.

ఓ నేస్తం!

ఓ నేస్తం! ఓ యాత్రీ!
మరి ఇంకెందుకు ఆలస్యము నీ కోసమే ఉందండి

ఓ 'పల్లెస్పందన- దివ్యతీర్థయాత్ర' మరో ప్రయాణం.

- పవన్ కుమార్ దాసుశెట్టి (ఎం.ఏ.), ఫోన్: 9550204448

ప్రియమైన పవన్,

మీరు దివ్య తీర్థ యాత్రల్లో పాల్గొని, యాత్రా లక్ష్యాలను పూర్తిగా అవగాహన చేసుకుని పద్య రూపంలో మాతో పంచుకున్నందుకు నీకు హృదయపూర్వక కృతజ్ఞతలు. గ్రామాభివృద్ధికై నీ తపన, కృషి తప్పక త్వరలో నెరవేరుతుందని మా విశ్వాసం.

- ప్రేమతో.... ప్రెసిడెంట్ గణేశం.

# జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన, రైతులు సృష్టించిన మామిడి - ఆపిల్ మొక్కల అమ్మకం

## సంవత్సరానికి మూడుసార్లు కాసే మామిడి రకం అంటు మొక్కలు

పాఠకులకు మనవి, 'జగదాంబ ఎస్-1, ఎస్-2 రకం మామిడి మొక్కలు సంవత్సరంలో మూడు సార్లు కాయలుస్తాయి. ఇవి పచ్చళ్లకు ఉపయోగ పడటంతో పాటు, పండ్లు అయిన తర్వాత తినటానికి కూడా రుచికరంగా ఉంటాయి. ఈ మొక్కలు కావలసిన వారు క్రింది బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు జమ చేయగలరు. **ఒక మొక్క ఖరీదు రూ. 600/-లు**

## హెచ్.ఆర్.ఎం.ఎన్.-99 రకం 'ఆపిల్' మొక్కలు

ఈ రకం 'ఆపిల్' మొక్కల ప్రత్యేకత : సుమారు 43-48 డిగ్రీల వేడి వాతావరణంలో కూడా పంటను అందిస్తాయి. మొక్క చూడటానికి వేరు లాగా వుంటుంది కానీ, నాటిన 10-15 రోజుల నుంచి చిగురిస్తుంది. మొక్క నాటిన రెండవ సంవత్సరం నుండి పువ్వులు పూస్తుంది. మూడవ సంవత్సరం నుండి పండ్లుకాస్తుంది. తినటానికి రుచికరంగా వుంటాయి. మొక్కలు నాటే సమయం - డిసెంబర్ - జనవరి నెలలు. అన్ని రకాల భూములు అనుకూలమే.

**ఒక మొక్క ఖరీదు : రూ. 220/-లు**



**ఈ మొక్కలకు జాతీయ గుర్తింపు, సర్టిఫికేషన్ ఉంటుంది.**
**ఎస్.ఐ.ఎఫ్. ద్వారా ఇది మార్కెట్‌లోకి అడుగు పెట్టింది.**

పూర్తి వివరాలకు సంప్రదించండి:

సుభాష్ చందర్, మేనేజింగ్ డైరెక్టర్, క్రియేటివ్ మైండ్స్, ఫోన్: 96528 01700, 040-27111959


బ్యాంకు అకౌంటు వివరాలు : Name of the A/c: Creative Minds, A/c No: 510101006285094
IFScode : CORP0000640, Corporation Bank, Sainikpuri Branch

PALLE SRUJANA Telugu Bi-monthly Nobember-December 2019 RNI No. TELTEL 2012/74620


# పల్లెసృజన





## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**





పల్లెసృజన చందాదారులు కండి. పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

| చందా వివరాలు | వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|---|
| | రెండు సంవత్సరాలకి | 400/- | 1,600/- |
| | ఐదు సంవత్సరాలకి | 1,000/- | 4,000/- |

పల్లెసృజన, 102, ..., సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us ; www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ ఖాతాలో జమ చేయండి.
[illegible]

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

లేదా ఫోన్ పే ద్వారా చెల్లించదలుచుకున్న వారు 9866 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

PhonePe

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904